VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

4 పేజీలు ఒక అణా రిజిష్టర్డు నెం A 193

విశాలాంధ్ర

205674

సంపుటి 4 ★ విజయవాడ: శుక్రవారం మార్చి 30; 1956 ★ సంచిక 369

అదనపు పన్నులు వేయక తప్పదట!

ఆంధ్ర ముఖ్యమంత్రి ప్రకటన

కర్నూలు, మార్చి 29

ఆంధ్రముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఈరోజు శాసనసభలో మాట్లాడుతూ, అదనపు పన్నులు వేయక తప్పదన్నారు. హైదరాబాదుకు వెళ్ళేలోగానే బడ్జెటులోటు పూరించుకోవడం ఉచిత మన్నారు. ఈ లోగా భూసంస్కరణలు ప్రవేశపెట్టడం సాధ్యపడదన్నారు.

ఆంధ్ర అసెంబ్లీ సమావేశం ఏప్రిల్ 2 కు వాయిదా

కర్నూలు, మార్చి 29

ఆంధ్ర అసెంబ్లీ సమావేశం ఏప్రిల్ 2 వ తేదీ ఉదయం 9 గంటలకు వాయిదా వేయబడింది.

ధాన్యం, పంచదార మున్నగువాటిపై కొనుగోలు పన్ను విధించే బిల్లు [illegible] చర్చకు వస్తుంది.

ఆగ్నేయాసియా-బాగ్దాద్ ఒడంబడికలతో మనదేశానికి దిగ్బంధన

రెండు మూడు దిక్కులనుండి ఏర్పడిందని లోక్‌సభ చర్చ సందర్భంలో ప్రధాని నెహ్రూ ప్రకటన

పాకిస్థాన్ బలంచూపి వ్యవహరించాలని అనుకొంటోందని ఖండన

న్యూఢిల్లీ, మార్చి 29

"ఆగ్నేయాసియా, బాగ్దాద్ ఒడంబడికలు ప్రధానంగా తప్పు మార్గంలో ఉన్నాయి. అంతేగాక మనకు ఉపద్రవకరంగాను, ఒక విధంగా మనదేశాన్ని రెండు మూడు దిక్కులనుండి దిగ్బంధన చేసేవిగాను పరిణమించాయి" అని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభ చర్చ సందర్భంలో అన్నారు.

"భారతదేశంపట్ల వ్యతిరేకతతోనే ప్రధానంగా పాకిస్థాన్ బాగ్దాద్, ఆగ్నేయాసియా ఒడంబడికలలో చేరింది. భారతదేశం అంటే పాకిస్థాన్ ఏదో ఆందోళన పెట్టుకొన్నది లేదా బలాన్ని పెంచుకోవాలని కోరుతున్నది. నిజమే చెప్పాలంటే బలం చూపి వ్యవహరించాలని అనుకుంటూంది" అని శ్రీ నెహ్రూ అన్నారు.

ఇంకా ఇలా అన్నారు:

"పాకిస్థాన్ అంటే నాకు వ్యతిరేకత లేదు. చెప్పలేనంత దిగులుతో తప్పితే పాకిస్థాన్‌తో యుద్ధం గురించి నేను తలపెట్టలేను.

అయితే బాగ్దాద్ ఒడంబడికలో చేరిన ఇతరదేశాలకు భారతదేశం అంటే వ్యతిరేకతలేదని నేనుదృఢంగా విశ్వసిస్తున్నాను. అమెరికా విదేశాంగమంత్రి నాకిచ్చిన వాగ్దానాలను పూర్తిగా అంగీకరించడానికి నేను సంసిద్ధంగా ఉన్నాను. వారు చెడ్డతలపులేమీ పెట్టుకోలేదని కూడా అనుకుంటాను. ఈసందర్భంలో భారతదేశం గురించి వారు తలపెట్టలేదు కూడా. వారి దృష్టి ఉత్తరంవైపు గాని, మరేవైపుగాని వుండవచ్చు. కాని ఫలితం మాత్రం ఒకటే."

ఇండోచైనా గురించి మాట్లాడుతూ శ్రీ నెహ్రూ ఇలా అన్నారు: "పరిస్థితులు ఏవిధంగా పరిణమిస్తాయో నాకు తెలియదు. జెనీవా ఒప్పందానికి సంబంధించిన బాధ్యతలను దక్షిణ వియత్నాం అంగీకరించ వచ్చునని కొన్ని ఆశాజనకమైన సూచనలు కన్పిస్తున్నాయి.

కంబోడియా గురించి ఒక చిక్కు వచ్చిపడింది. తాను ఏ కూటములతోను చేతులు కలపనని, ఇతర దేశాలతో స్నేహ సంబంధాలను పెంపొందించుకొంటానని ఆ దేశం ఇటీవల కొంత స్పష్టంగా చెబుతోంది. దీని ఫలితంగా కొన్ని ఇరుగుపొరుగు దేశాలతో దాని సంబంధాలు అంతగా బాగుగా లేవు. కారణం ఏదైనా గావచ్చుగాని ఒక రకంగా సరిహద్దుమూసివేశారు. పాక్షికంగా ఆర్థికదిగ్బంధన కూడా జరుగుతోంది."

విదేశాంగ శాఖ పద్దుపై చర్చ మధ్యలో శ్రీ నెహ్రూ మాట్లాడుతూ ఇలా అన్నారు:

"విదేశాంగ విధానంలోగాని మరే విధానంలోగాని విజయపరంపరలనే అన్నిచోట్ల పొందలేము. మనకు అనేక చిక్కులు సంభవించాయి. ఇకముందు కూడా అనేకం కల్గవచ్చు. అనేక ముఖ్యసమస్యల పరిష్కారాల్లో మనకు విజయాలు కలుగలేదు. ఏదైనా సమస్య గురించి మనం విజ్ఞతతో కూడిన కొన్ని చర్యలను తీసుకొనిఉండవచ్చు. అందువలన సత్ఫలితాలు కల్గవచ్చు. అయితే ఏదైనా సంఘటన జరిగిపోయిన తర్వాత మనం తెలివితేటలు చూపించటం సులభమే."

ఆచార్య కృపలానీ, ఇతర ప్రతిపక్షనాయకులు విదేశాంగ విధానం గురించి చేసిన విమర్శలకు సమాధానం చెబుతూ శ్రీ నెహ్రూ ఇంకా ఇలా అన్నారు:

"అయితే ఈసమస్యలన్నీ ఒకదానికొకటి సంబంధం లేకుండా లేవు. ప్రపంచంలోని కొన్ని మూలసమస్యలతో ముడిపడివున్నాయి. అందుచేత స్వల్పసమస్యలుకూడా ఒకసారి పెద్దసమస్యలై కూర్చోవచ్చు. ఈ స్వల్ప సమస్యలను, ఇవి అంతర్జాతీయ స్వభావకమైనట్టివి గనుక - పరిష్కారసాధ్యంకావని అనుకుంటే అది తప్పిదమౌతుంది.

అటుపైన శ్రీ నెహ్రూ నేడు ప్రపంచంలో జరిగిన, జరుగుతున్న కొన్ని ప్రధాన పరిణామాల ప్రసక్తి తెచ్చి ఇవి ప్రపంచంలోని వివిధ రంగాలలో ఆలోచనా క్రమాన్ని, కార్యాచరణ విధానాన్ని మార్చివేస్తాయని తాను నమ్ముతున్నట్లు తెలియజేశారు.

హైడ్రోజన్ బాంబు, సాంకేతిక అభివృద్ధి, పారిశ్రామిక నాగరికత, - మానవాళికి ఎంతైనా మేలు, లేక ఎంతైనా విధ్వంసం కల్గించేంత బ్రహ్మాండంగా అభివృద్ధి పొందాయి. ఇంతవరకు ఉన్న యుద్ధవ్యూహాలను, అందుగురించిన భావనలను ఇప్పుడు కాలదోషం పట్టింది. దీనిని చాలమంది గుర్తిస్తారు కాని ఈ నూతన పరిణామాలు రాజకీయ, ఆర్థిక ఆలోచనా విధానాలను అన్ని రాజకీయ పార్టీల సిద్ధాంతాలను తల్లక్రిందులు చేస్తున్నాయని మీరు గుర్తించి ఉండరు. ఈ నవయుగానికి అనుగుణ్యంగా మనం మారకపోతే మనం వెనకబడి పోతాం. నూతన పరిస్థితులను అలవాటు చేసుకొని నూతన ప్రమాదాలనుండి మనం తప్పించుకోలేని స్థితిలో పడతాం".

టోలుగేటు పన్ను పరిహారం రద్దు

ఆంధ్ర మంత్రివర్గ సూచనకు కాంగ్రెసు పార్టీ ఆమోదం

కర్నూలు, మార్చి 28

మూడవఫారంవరకు ఉచితవిద్యాబోధ చేయించడంవల్ల వచ్చే నష్టాన్ని పూర్తిచేసుకోడానికి ఆంధ్రమంత్రివర్గం చేసిన నిర్ణయాలను ఈవేళ సాయంకాలం జరిగిన ఐక్యకాంగ్రెసు పార్టీసమావేశంలో ఆమోదించారు.

ఉచిత విద్యాబోధ చేయిస్తే, ప్రభుత్వానికి సుమారు 15 లక్షల రూపాయలు నష్టంవస్తుంది.

మునిసిపాలిటీలలో ఇప్పుడుటోల్‌గేటుపన్ను వసూళ్లు రద్దు చేయబడాయి. మునిసిపాలిటీలకు ఈవిధంగా వచ్చేనష్టాన్ని నష్టపరిహారరూపంలో ప్రభుత్వమే భరిస్తుంది. ఉచిత విద్యాబోధవల్ల కలిగే నష్టం దృష్ట్యా ఇకముందు మునిసిపాలిటీలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వదు. స్థానిక సంస్థలలో ఇప్పుడు వినోదపు పన్ను వసూలు చేస్తున్నారు. అందులో నూటికి మరో పది వంతులను ప్రభుత్వం తీసుకొంటుంది. నష్టపరిహారం ఆపివేయడం ద్వారా ప్రభుత్వానికి సుమారు అయిదులక్షలు మిగులుతాయి. ప్రభుత్వం ఇప్పటివరకు వినోదపు పన్ను వసూలు చార్జికింద నూటికి పదివంతులు మాత్రమే తీసుకొంటున్నది. ఇకముందు వినోదపు పన్ను వసూళ్ళలో నూటికి ఎనభై వంతులు మాత్రమే స్థానిక సంస్థలకు లభిస్తుంది.

మునిసిపాలిటీలకు మరింత ఆర్థిక లోపం కలిగించే ఈ పద్ధతిని శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డిగారు వ్యతిరేకించినట్లు తెలియ వచ్చింది.

పంచదార, ధాన్యం మున్నగు వాటిపై కొనుగోలు పన్ను విధించాలన్న నిర్ణయాన్ని కూడ సమావేశం వారు ఆమోదించారు.

భారతదేశంలో నూనె పరిశ్రమ స్థాపనకు రష్యా సహాయం:

ఢిల్లీలో మికోయాన్ వివరణ

న్యూఢిల్లీ, మార్చి 28

ఇండియా తన నూనె పరిశ్రమను నిర్మించుకోడానికి సోవియట్ తనకు ఆ పరిశ్రమలోగల అనుభవాన్ని అందజేస్తుందని సోవియట్ ఉప ప్రధాని మికోయాన్ తెలియజేశారు.

భారత వాణిజ్య మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నిన్న రాత్రి విందుచేసిన సందర్భంలో మికోయాన్ మాట్లాడుతూ, ఇలా అన్నారు:

"భారత-సోవియట్ వర్తకంలో, ఇండియా విదేశ మారక పరిస్థితిపై భారం వేయకుండా వుండాలని సోవియట్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నది. అందుచేతనే, ఇండియాకు మా సరకుల అమ్మకంవల్లవచ్చే ధనాన్ని భారతదేశ ముడిపదార్థాలను, తయారీ సరకులను కొనడానికి వినియోగించదలుచుకున్నాం.

"మీదేశంలో మీరు తయారుచేసుకునే సరకులనే మీకు అమ్మాలని మేముభావించడంలేదు. ఎందుకంటే మీ పరిశ్రమలతో, వ్యవసాయంతో పోటీచేయాలనే ఉద్దేశం మాకులేదు. కాగా భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడే సరకులనే మేము అమ్మదలిచాం. అందుకనుగుణంగా, ఇండియా ఎగుమతిచేయగలిగే ముడిపదార్థాలను, తయారీ సరకులను సోవియట్ కొనుక్కుంటుంది."

భిలాయి ఉక్కు కర్మాగారంపై భారత సోవియట్ ఒప్పందం, ఉభయదేశాల మధ్య సన్నిహిత ఆర్థిక సంబంధాల అభివృద్ధికి ముఖ్యమైన మెట్టు అని మికోయాన్ పేర్కొన్నారు. భిలాయి కర్మాగారానికి [illegible] తయారు చేస్తున్న [illegible] ఈ ఒప్పందాన్ని పశ్చిమదేశాలతో శాంతియుత ఆర్థిక పోటీకి ఉదాహరణగా భావిస్తున్నామి. ఈ పోటీలో మా భారతమిత్రులు న్యాయమూర్తి పాత్ర వహించాలి అని అన్నారు.

"నూనె, బొగ్గు, తదితర లోహ పరిశ్రమలను పెంపొందించు

(మిగతా 4వ పేజీలో)

ఎస్టేట్ భూముల బిల్లుపై సెలెక్టు కమిటీ నివేదిక

కర్నూలు, మార్చి 29

సెలెక్టు కమిటీ నివేదించిన ప్రకారం, ఎస్టేట్ భూముల సవరణ బిల్లును గెజెట్‌లో ప్రకటించాలా కూడదా అనే విషయంపై నిర్ణయాన్ని శాసనసభా స్పీకరు శ్రీ లక్ష్మీనరసింహం దొర రేపటికి వాయిదావేశారు.

శాసనసభ్యులకు అందించకపూర్వమే నివేదిక సవరణతో సహా బిల్లును గెజెట్‌లో ప్రకటించారు. గనుక ఈ నివేదికను గెజెట్‌లో తప్పక ప్రకటించాలని శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు అన్నారు.

స్పీకరు సూచన చేసినట్లయితే నివేదికను గెజెట్‌లో ప్రకటించడానికి తమకెట్టి అభ్యంతరము లేదని శ్రీ గోపాలరెడ్డిగారన్నారు.

సెలెక్టు కమిటీ నివేదిక నేటి ఉదయం సభ్యులకు అందజేశారు.

చౌఎన్‌లైకి పాకిస్థాన్ ఆహ్వానం

కరాచీ; మార్చి 28

చైనా ప్రధాని చౌ-ఎన్-లైని పాకిస్థాన్ ఆహ్వానించేందుకు పాక్ ప్రభుత్వం నిశ్చయించుకున్నదని విశ్వసనీయ వర్గాల వలన తెలుస్తూంది.

మేమాసం మధ్యలో పాక్ ప్రధాని మహమ్మదలీ చైనా వెళ్లేటప్పుడు చౌ ఎన్ లైకి ఆయన స్వయంగా ఆహ్వానం అందజేస్తారని తెలుస్తూంది.

పంచవర్ష ప్రణాళికను గురించిన చిత్రపటాల ప్రదర్శన ఒకటి మార్చి 29 నుండి ఏప్రిల్ 6 వరకు మద్రాసులో జరుగుతుంది.

విశాలాంధ్ర ఏర్పడక ముందే భూసంస్కరణలు

అసెంబ్లీలో శ్రీ పిల్లలమర్రి సూచన

[విశాలాంధ్ర విలేఖరి]

కర్నూలు, మార్చి 29

కమ్యూనిస్టుపక్ష ఉపనాయకుడు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు ఈవేళ ఆంధ్రశాసనసభలో ఉపన్యసిస్తూ విశాలాంధ్ర ఏర్పడకముందే ఆంధ్రలో భూ సంస్కరణలు తీసుకొని రావాలని కోరారు.

గత రెండేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వాదాయం నాలుగు కోట్లు పెరిగిందన్న విషయం ప్రస్తావించి, అమ్మకం పన్ను ఎగ్గొట్టడం ఆపుచేస్తే మరో రెండుకోట్లు ఆదాయం వస్తుందన్నారు. మనకు డబ్బు ఖర్చుపెట్టడం చేతకాదని కేంద్రం భావించడం పొరబాటన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి పొందిన రాష్ట్రాలకే కేంద్రంలో పలుకుబడి వుందన్నారు.

కృష్ణాజిల్లాలో కొందరు గ్రామోద్యోగులు జీతాల సమస్యపై రాజీనామా ఇచ్చిన సంగతిని శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు రెవిన్యూ మంత్రి దృష్టికి తెచ్చారు.

అటువంటి వారిపై కట్టిచర్య తీసుకొంటామని రెవిన్యూ మంత్రి అన్నారు.

శ్రీ మహమ్మద్ తహశీల్, ఏజన్సీ ప్రాంతాలలో నెలకు రెండు రూపాయలు మాత్రమే జీతం పొందుతున్న గ్రామోద్యోగులు వున్నారని తెలియజేశారు.

అటువంటివారికి జీతం హెచ్చించే విషయమై ఆలోచిస్తామని, ఆవిధంగా ఉత్తరువులు పంపుతామని రెవిన్యూ మంత్రి అన్నారు.

అప్పుడు శ్రీ బివి కొండయ్యగారు, వాటిని అమలు జరపడానికి నాలుగు వేల ఏండ్లయినా పడుతుందా? అని ప్రశ్నించారు.

'కాశ్మీర్ ప్రిన్సెస్' విధ్వంసకునికి అమెరికా బహుమతి

బ్రిటిష్ కామన్సు సభలో వెల్లడి

లండన్, మార్చి 29

నిరుడు ఏప్రిల్ మాసంలో హాంకాంగ్ నుండి బాండుంగ్ మహాసభకు కొంతమంది చైనా ప్రతినిధులతో బయలుదేరిన భారత విమానం "కాశ్మీర్ ప్రిన్సెస్" లో టైమ్ బాంబు పెట్టి దానిని ప్రేల్చినట్టి హంతకునికి అమెరికా ప్రభుత్వం 40 వేల పౌనులను బహుమతి ఇచ్చినట్లు తనకు తెలిసిందని లేబరు సభ్యుడు జాన్ బైర్డ్ కామన్సుసభలో వెల్లడి చేశారు. విమానం పేలిపోయిందన్న వార్త తెలిసి తెలియడంతోనే చౌంగ్ మూతా వాడయిన ఆ హంతకునికి అమెరికావారు ఆ సొమ్ము చెల్లించారని ఆయన వివరించారు.

ఆ హంతకుని తమకు అప్పగించవలసిందిగా హాంకాంగ్‌లోని బ్రిటిష్ అధికారులు కోరిన కోరికను చాంగ్ - కై - షెక్ నిరాకరించిన విషయం ఆయన సభికులకు జ్ఞాపకం చేశారు.

"కాశ్మీర్ ప్రిన్సెస్" ప్రమాదంలో అయిదుగురు భారతీయ వైమానికోద్యోగులు, పదకొండుమంది చైనా వారూ మరణించిన విషయం పాఠకులకు తెలిసినదే.

నాగార్జున ప్రాజెక్టుకు అంచనాలు మించే ఖర్చు

దాదాపు 200 కోట్ల రూపాయలు అవుతాయని శ్రీ గోపాలరెడ్డి అభిప్రాయం

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మార్చి 29

ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు ఈవేళ శాసనసభలో మాట్లాడుతూ, నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి అయ్యేటప్పటికల్లా అంచనాలను మించిన ఖర్చు కాగలదనే భయసందేహాలు వెల్లడించారు.

అప్రాప్రియేషన్ బిల్లుపై మాట్లాడుతూ శ్రీ గోపాలరెడ్డిగారు పైవిధంగా అన్నారు.

కువ్వార్ సేన్ కమిటీ సూచించిన మేరకు నెల్లూరు జిల్లాలో కుడికాల్వ నిర్మించాలని శ్రీ ఎల్లమందారెడ్డిగారు చేసిన సూచనను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తిరువూరు, నూజివీడు తాలూకాలకు కూడ ఎడమ కాల్వద్వారా నీరు అందించాలని, అక్కడి ప్రజలు ఆందోళన చేస్తున్నట్లు తెలియజేశారు. ఆ విధంగా చేయాలంటే అదనంగా ఎనిమిదికోట్ల రూపాయలు ఖర్చు అవుతాయన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఖర్చు 122 కోట్లనుండి 150 లేదా 200కోట్లకు పెరుగుతుందన్నారు. ప్రాజెక్టు పెట్టుబడిపై లభించేంత ఆదాయం రాని పక్షంలో కేంద్రం కాని, ప్రణాళికా సంఘం కాని ఇందుకు అంగీకరించరనే భయసందేహాలు వెల్లడించారు.

వచ్చే ఏప్రిల్ 9 వ తేదీన శ్రీ కువ్వార్ సేన్ కర్నూలు వస్తున్నారని, ప్రాజెక్టు నిర్మాణాన్ని గురించి, రైతుల సాగుబడి బాధలను గురించి ఆయనకు తెలుపవచ్చునని శ్రీ గోపాలరెడ్డిగారు అన్నారు.

అనంతపురం జిల్లాలో ఊటకాల్వల కింద భూములకు తీరువాజాస్తి తగ్గించారని, ఇతరచోట్ల తగ్గించలేదనే ఆరోపణను ప్రస్తావించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఊటకాల్వల కింది భూములపై పన్ను హెచ్చించబడుతుందే కాని, తగ్గించబడదన్నారు.

ఏప్రిల్ 2 వ తేదీన కొనుగోలు వస్తువులపై పన్నుబిల్లు ప్రవేశపెడుతున్నామని, దీనిని అందరూ బలపరచాలని విజ్ఞప్తి చేశారు. "సర్‌చార్జి" వచ్చే జూన్ నెలలో ఆగిపోతుందన్నారు. ఆహార వస్తువుల ధరలు పెరిగాయి కాబట్టి రైతులు పన్నులు భరించగలరన్నారు.

జిల్లాబోర్డులకు రోడ్ల నిర్మాణాలు నిర్మించుకొనేందుకై అప్పులు ఇవ్వ[illegible] ముఖ్యమంత్రి తెలియజేశారు.

ఐక్య కాంగ్రెసుపార్టీ సమావేశాలు

ఒకపక్షంవారు గైరుహాజరు అవుతున్నారట

కర్నూలు, మార్చి 29

ఐక్య కాంగ్రెసుపార్టీ సమావేశాలకు ఒకపక్షంవారు బుద్ధిపూర్వకంగా హాజరు కావడంలేదని తెలియవచ్చింది.

నిన్న సాయంకాలం జరిగిన సమావేశానికి శ్రీ సంజీవరెడ్డిగారు హాజరు కాలేదు. సమావేశానికి 30 మంది మాత్రమే వచ్చారు. (వి. వి.)

ఐస్లాండులో అమెరికాకు చుక్కెదురు

రెక్జావిక్, మార్చి 28

ఐస్లాండులో తిష్టవేసుకొని ఉన్న అట్లాంటిక్ కూటమి సేనలను వెంటనే ఉపసంహరించాలని ఐస్లాండు పార్లమెంటు నేడు తీర్మానించింది.

ఐస్లాండులోని కెఫ్లావిక్‌లో అట్లాంటిక్ కూటమి పేరుతో అమెరికావారు ఒక యుద్ధ విమాన స్థావరం ఏర్పాటుచేసుకొని ఉన్నారు. ఈ విషయమై 1951 లో జరిగిన ఒడంబడికను మార్చాలనికూడా పార్లమెంటు తీర్మానించింది.

ఐస్లాండు మంత్రివర్గంలో నిన్న ఈ సమస్య చర్చకు వచ్చినప్పుడు మంత్రివర్గంలో చీలిక ఏర్పడింది. అట్లాంటిక్ కూటమి అభిమాని అయిన ప్రధాని ఒలాఫర్ థోర్స్ రాజీనామా ఇచ్చారు. మిశ్రమ మంత్రివర్గంలో పాల్గొన్న ప్రోగ్రెసివ్ పార్టీ ప్రతిపక్షంలోని కమ్యూనిస్టు, సోషలిస్టు, నేషనల్ డిఫెన్స్ పార్టీ, సోషల్ డెమాక్రటిక్ పార్టీలతో కలిసి నేటి తీర్మానానికి అనుకూలంగా ఓటు చేసింది.

వ్యవసాయ శాఖ పద్దుపై చర్చ

కర్నూలు, మార్చి 28

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ఆంధ్రలో యేడుచోట్ల వ్యవసాయ పరిశోధన కేంద్రాలు స్థాపించడానికి ఒక స్కీమును కేంద్ర వ్యవసాయ పరిశోధన శాఖవారు సంసిద్ధపరచారని వ్యవసాయశాఖ మంత్రి శ్రీ ఓబులరెడ్డిగారు నేడు శాసనసభలో తెలియజేశారు.

వ్యవసాయం, మత్స్యపరిశ్రమశాఖలకు రు 97,3,900, అటవీశాఖకు రు. 65,78,600, వెటర్నరీ శాఖకు రు. 81,23,100 కేటాయించాలని శ్రీ ఓబులరెడ్డిగారు ప్రతిపాదించారు. [illegible] కూరగాయల పరిశోధనా [illegible], కూరగాయలకు, పండ్లకు [illegible] గురించి పరిశోధనలకు పథకాలు ద్వితీయ ప్రణాళికలో ఉన్నాయని అన్నారు.

అడవుల అభివృద్ధికి రాష్ట్ర [illegible] ఒక సంస్థను ఏర్పాటుచేసే విషయమై పరిశీలనలో ఉందన్నారు. ఇతర అభివృద్ధి ప్రణాళికల గురించి తెలిపారు.

ప్రసంగంలో శ్రీ కడప కోటిరెడ్డిగారు మాట్లాడుతూ పంటల రోజుల్లోనే పన్నులు వసూలు చేయడం వలన రైతులు తమ పంటలను తక్కువ ధరలకు అమ్ముకోవలసి వస్తున్నదని, అందుచేత [illegible] కొంతం ధర వచ్చిన తరువాతే రైతులు ధాన్యాలను అమ్ముకోడానికి వీలేర్పడుతుందని అన్నారు.

శ్రీ ఎన్. వి. చంగల్వరాయనాయుడు మాట్లాడుతూ ప్రతిజిల్లాకు ఒక వ్యవసాయ పాఠశాల ఉండాలన్నారు.

శ్రీ ఓబులరెడ్డిగారు చర్చకు సమాధానం యిస్తూ యిటీవలనే తన చేతులకి వచ్చిన శాఖలపై వచ్చిన విమర్శ అంతా సరియైనదేనని అంగీకరించారు. లోపాలను సరిదిద్దడానికి పూనుకుంటూ న్నారు. వ్యవసాయదారులసంతతికి వ్యవసాయ శాస్త్రం నేర్పడానికి పాఠశాలలుండాలన్నారు. కళలు, సాహిత్యం చదువుతున్న వ్యవసాయదారుల సంతతివారికి వ్యవసాయంలో ఆసక్తి ఎట్లా ఉంటుందని అన్నారు.

కలకత్తాకు మికోయాన్ రాక

కలకత్తా, మార్చి 29

సోవియట్ ప్రథమ ఉపప్రధాని, అనాస్టాస్ మికోయాన్, తన పరివారంతో ఈవేళ సాయంత్రం కలకత్తా చేరారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యులూ, ఇతర ప్రముఖులూ విమానాశ్రయంలో ఆయనకు ఘనమైన స్వాగత మిచ్చారు.

ఈ వేళ రాత్రి కలకత్తాలో గడిపి మికోయాన్ రేపు రంగూన్ వెళ్తారు.

ఢిల్లీలో వీడ్కోలు

ఉదయం ఢిల్లీనుంచి బయలుదేరినప్పుడు వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి, విదేశాంగమంత్రిత్వ శాఖలో ఒక మంత్రి అయిన డాక్టరు సయ్యద్ మహమద్, సమాజ సంపదలశాఖ మంత్రి శ్రీ కె. డి. మాలవీయా, శ్రీమతి ఇందిరా గాంధీ మొదలైనవారు మికోయాన్‌కి ఘనమైన వీడ్కోలు ఇచ్చారు.

భారతదేశంగురించి చాలావిన్నాను, చాలా చదివానుగాని, ప్రత్యక్షంగా చూచేవరకు ఈ దేశం ఇంత రమణీయమైనదని అనుకోలేదని మికోయాన్ పాలమ్ (ఢిల్లీ) విమానాశ్రయంలో ప్రసంగిస్తూ అన్నారు. ఢిల్లీలో తాను గడిపిన నాలుగు రోజుల్లో చాల మంది పరిచయం చేసుకున్నాను. చాల మంది స్నేహితుల్ని సంపాదించుకున్నాననీ అన్నారు. భారత - సోవియట్ స్నేహసంబంధాలు ఇకముందు కూడా నిరంతరం బలపడుతూ ఉంటాయని తన దృఢవిశ్వాస మన్నారు.

తాజ్‌మహల్ సందర్శన

ఢిల్లీనుండి విమానం కలకత్తా వెళ్తూ మికోయాన్, తన పరివారంతో ఆగ్రాలో ఒక గంటసేపు ఆగారు. విమానాశ్రయం నుండి కారులో వెళ్లి తాజ్‌మహల్ సందర్శించారు.

లండనులో మాలెంకోవ్ కార్యక్రమం

కామన్సు సభ సందర్శన

లండన్, మార్చి 28

ప్రస్తుతం బ్రిటన్‌లో పర్యటిస్తున్న సోవియట్ ప్రథమ ఉప ప్రధాని, విద్యుచ్ఛక్తి శాఖమంత్రి అయిన జార్జి మాలెంకోవ్ స్కాట్లండు సంచారం పూర్తిచేసుకొని నేడు విమానంలో లండను తిరిగి వచ్చారు. ఈవేళ ఆయన కామన్సు సభ కార్యక్రమాలను తిలకించారు. ఆయనకు పార్లమెంటు భవనాల నన్నిటినీ చూపించారు. "మొదటి చూపులకు అంతా బాగానే ఉంది" అని మాలెంకోవ్ అన్నారు.

1956 మార్చి 30 శుక్రవారం
మన్మథనామ సంవత్సర
ఫాల్గుణ బహుళ
చవితి సా. 6-38
విశాఖ సా. 4-6

విశాలాంధ్ర

శుక్రవారం 30-3-56

అణ్వాయుధ పరీక్షలు

ఏప్రిల్ 20 మొదలు పసిఫిక్ మహాసముద్రంలోని మార్షల్ దీవులలో అణ్వాయుధ పరీక్షలు జరపాలని, అమెరికా అధ్యక్షులైన ఐసెన్‌హోవర్ స్వయంగా నిర్ణయించారు.

అణ్వాయుధ ప్రయోగాలను విరమించవలెనని, కనీసం తమ దీవులలో కాక మరెక్కడనైనా జరుపుకోమని ఆ దీవులలోని పౌరులు అమెరికాను అభ్యర్థించారు. ధర్మకర్తృత్వ ప్రాంతాలలో అణు ప్రయోగాలు జరపటం న్యాయ విరుద్ధమని, సోవియట్, భారత ప్రభుత్వాలు ఆక్షేపణలను వెలిబుచ్చాయి. కాని ఈ అభ్యర్థనలను, ఆక్షేపణలను త్రోసివేసి, మార్షల్ దీవులలో అణు పరీక్షలు జరపడానికే అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికా పాలక వర్గాలకు, తమ ధర్మకర్తృత్వ ప్రాంతాలపట్ల ఎంతటి నిరసనభావమున్నదో ఈ ఘటన స్పష్టంగా తెలియజేస్తుంది.

లోగడ పసిఫిక్‌లో జరిగిన అణుబాంబు ప్రయోగాల ఫలితంగా, కొన్ని వందల మైళ్ళ అణుధూళి ప్రసరించి, సముద్రంలోని జీవకోటి అంతా నశించింది. జపాన్ తీరం వరకూ ఈ ధూళి వ్యాపించిన ఫలితంగా కోస్తాతీరంలో చేపలు పట్టుకునే కొందరు జపాను పౌరులు శాశ్వతంగా వికలాంగులైనారు. జపానులో రేడియో ధార్మికశక్తితో కూడిన వర్షాలు కురిశాయని, తత్ఫలితంగా ప్రాణనష్టం జరిగిందనీ స్పష్టమైంది. ఈ దుష్ఫలితాలన్నీ అనుభవించిన జపాను ప్రభుత్వం ఈసారి అణుబాంబు పరీక్షలను మా ప్రాంతంలో జరపవద్దని గట్టిగా ప్రతికూలించింది.

క్రిందటిసారి జపాన్ పౌరులను తమ అణు పరీక్షలకు గురిచేసిన అమెరికన్ సామ్రాజ్యవాదులు ఈసారి, మార్షల్ దీవి పౌరులను గురిచేయదలచుకున్నారు. ఇతర దేశాల ప్రజలను, అందులో తమ ధర్మకర్తృత్వ ప్రాంతాలలోని ప్రజలను, ఇట్టి ప్రమాదకరమైన పరీక్షలకు గురిచేయటం అమానుషత్వం తప్ప మరొకటి కాదు. అంతేకాదు మార్షల్ దీవివాసుల అభ్యర్థనకు సమాధానంగా అమెరికా సామ్రాజ్యవాదులు ఇలా సమాధానం చెప్పారు: "అణు [illegible] ప్రజలకు హాని కలుగకుండా ఏర్పాట్లు చేస్తాం. ఒక్క ప్రాణికికూడా అపకారం జరగదు. పైగా ఈ ప్రయోగాలు మీ దీవులలో జరగడం మీ కెంతో గౌరవప్రదమైన విషయం."

ఇంతకంటె అహంకారపూరితమైన సమాధానం మరొకటి ఉండబోదు. అణుబాంబు ఉపయోగాలవల్ల ఒక్క ప్రాణికి నష్టం జరగకపోతే, ఆ ప్రయోగాలు గౌరవప్రదమయినవైతే, అట్టి ప్రయోగాలను అమెరికా సామ్రాజ్యవాదులు తమ దేశంలోనే జరుపుకోరాదా? తమ తమ ధర్మకర్తృత్వ ప్రాంతాలలో ఎందుకు జరపాలి? అమెరికా వారి ధర్మకర్తృత్వ విధానానికి ఇది ఒక మచ్చుతునక కాబోలు!

కనుక, ఈ ప్రయోగాలను మార్షల్ దీవులలో జరుపరాదని, భారత ప్రభుత్వం వెలిబుచ్చిన ఆక్షేపణను భారత ప్రజలందరూ హృదయ పూర్వకంగా బలపరుస్తారు. ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని గమనించక, అణు పరీక్షలను, తిరిగి జరపటానికి పూనుకుంటున్న అమెరికన్ సామ్రాజ్యవాదుల చర్యలను ఖండిస్తారు.

వ్యాఖ్యలు-విమర్శలు

ఆంధ్ర శాసనసభలో శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారడిగిన ప్రశ్నకు వ్రాతమూలకంగా ఇచ్చిన సమాధానంలో ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ఒక సత్యాన్ని అంగీకరించక తప్పలేదు. గొట్టం బావులకోసం, లిఫ్ట్ ఇరిగేషనుకోసం, ట్రాక్టర్ల వాడకంకోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గ్రాంటులను, అప్పులను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో వినియోగించుకోలేకపోయింది. తత్కారణంగా కేంద్ర ప్రభుత్వ గ్రాంటులకు కాలదోషం పట్టి ముగిసిపోయాయి.

ఉదాహరణకు 1953 అక్టోబరు నుంచి 1954 మార్చివరకు కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన 69 లక్షలలో రాష్ట్ర ప్రభుత్వం వినియోగించలేక పోయినందున 10 లక్షలు వాపసు అయిపోయాయి. అధికాహారోత్పత్తి పథకంక్రింద కేంద్ర ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు మంజూరుచేసిన రు. 165 వేలు ఆ ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుప నిరాకరించినందున డబ్బు వాపసు అయింది. అలాగే గొట్టం బావులకు కేంద్రం మంజూరుచేసిన రు. 223 వేల డబ్బు రాష్ట్ర ప్రభుత్వం వినియోగించనందున వాపసు అయిపోయింది.

ఆంధ్రరాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన గ్రాంటులే బహు స్వల్పం. ఐతే మంజూరయిన గ్రాంటులను సైతం వినియోగించలేక ఆంధ్ర ప్రభుత్వం తన చేతగానితనాన్ని నిరూపించుకుంటూంది. అందుచేత ఆంధ్ర మంత్రివర్గ చేతగానితనానికి పై వుదాహరణలన్నీ నిదర్శనలనవచ్చు.

◆ ◆ ◆

మొదటి పంచవర్ష ప్రణాళికలో వివిధ ప్రజోపయోగశాఖలకు కేటాయించబడిన ధనాన్ని ఆంధ్ర ప్రభుత్వం ఎలా వినియోగించిందో పరిశీలించితే మన మంత్రివర్గం చేతగానితనం మరింత చక్కగా బయటపడుతుంది.

ఉదాహరణకు విద్యకు కేటాయించబడిన 2 కోట్ల 97 లక్షలలో 1 కోటి 92 లక్షలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వినియోగించ గలిగింది. వైద్యానికి కేటాయించిన రు. 99 లక్షలలో రు. 76 లక్షలు మాత్రమే వినియోగించింది. ప్రజారోగ్యానికి కేటాయించిన రు. 6 కోట్ల 33 లక్షలలో 3 కోట్లు మాత్రమే ఉపయోగించింది. సహకార సంఘాలకు మంజూరు చేసిన రు. 57 లక్షలలో 18 లక్షలు మాత్రమే ఖర్చు చేసింది.

ప్రథమ పంచవర్ష ప్రణాళికలో [illegible] ఖాతాక్రింద కేటాయించబడిన మొత్తాలను ఉపయోగించలేకపోవడంలో కూడ ఇదే విధమైన చేతగానితనం నిరూపించబడింది. ఉదాహరణకు ఇరిగేషన్ ప్రాజెక్టుల క్రింద కేటాయించబడిన రు. 20 కోట్లలో 11 కోట్లు మాత్రమే ఉపయోగించింది. విద్యుచ్ఛక్తి స్కీములకు కేటాయించిన రు. 26 కోట్లలో 19 కోట్లు మాత్రమే వినియోగించింది. ఈ విధమైన చేతగానితనానికి ఎన్ని ఉదాహరణలైనా చూపించవచ్చు.

◆ ◆ ◆

కేంద్ర ప్రభుత్వం వరద నివారణ కిచ్చే గ్రాంటులనుండి బుడమేరు వరద నివారణ స్కీముకు అనుమతించింది. ఈ స్కీముకు శంకుస్థాపన జరుగుతుందనికూడ అందరూ ఆశించారు. కాని ఆఖరునిముషంలో మంత్రివర్గం ఈ స్కీములో భాగమైన రిజర్వాయరు నిర్మాణాన్ని ఎత్తివేయడానికి నిర్ణయించింది. అనగా కేంద్రప్రభుత్వం రిజర్వాయరుకు మంజూరు చేసిన 1 కోటి 50 లక్షల ధనాన్ని తృణీకరించినట్లే అవుతుంది.

బుడమేరు ముంపు నివారణ స్కీములో కట్టలు ఎత్తుచేయడం, రిజర్వాయరు నిర్మించడం, వర్షంపు కాల్వలద్వారా వరదనీటిని కృష్ణలోకి మరల్చడం ఈ మూడూ భాగాలుగా వున్నాయి. గవర్నరు పరిపాలన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీము అంతటినీ ఆమోదించింది. కాని తీరా రాష్ట్ర మంత్రివర్గం ఖర్చుకు తగిన ప్రతిఫలం రాదనే సాకుతో రిజర్వాయరు నిర్మాణ పథకానికి తిలోదకాలు వదలింది. ప్రతియేటా బుడమేటి వరదల ఫలితంగా వేలకొలది ఎకరాల పంటభూమి మునిగి కోట్ల విలువచేసేపంట నష్టమవుతూంది. కేంద్రంచే ఆమోదించబడిన స్కీము విడనాడటం అంటే ప్రతియేటా జరుగుతున్న నష్టాన్ని గుర్తించ నిరాకరించడమే అవుతుంది.

ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం అవలంబించే వైఖరి ఎటుచూసినా చేతగానితనాన్ని మాత్రమే నిరూపించుతూంది. చాకచక్యం, నైపుణ్యం కార్యదక్షత మచ్చుకైనా కన్పించదు. ఎప్పుడు నేర్చుకుంటారు?

సరిహద్దుల విషయమై నెహ్రూ-మహమ్మదలీ ఉత్తర ప్రత్యుత్తరాలు

కరాచి, మార్చి 28

భారత, పాకిస్తాన్ల మధ్య నిర్యుద్ధ ఒడంబడిక ఒకటి జరగాలని సూచిస్తూనూ, ఇటీవల జరిగిన సరిహద్దు సంఘటనలను గురించి ప్రస్తావిస్తూనూ ఈ నెల 21 వ తేదీని భారత ప్రధాని నెహ్రూ రాసిన జాబుకి పాక్ ప్రధాని చౌధరీ మహమ్మదలీ జవాబు రాశారని విషయజ్ఞులవలన తెలుస్తోంది.

అయితే ఈ జవాబులో నిర్యుద్ధ ఒడంబడిక ప్రసక్తి లేదనీ, సరిహద్దు ఘటనలను గురించి మాత్రమే రాశారనీ తెలుస్తోంది.

భారత - పాక్ నేల సరిహద్దుని మూడు మాసాల్లోనూ, ఆ తరువాత తొమ్మిది మాసాల్లో నీటి సరిహద్దులను నిర్ణయించాలని మహమ్మదలీ తన జవాబులో సూచించారని తెలుస్తోంది.

ఈ నెల 21 వ తేదీని నెహ్రూగారు రాసిన జాబు అంతకు ముందు మహమ్మదలీ రాసిన జాబుకి జవాబు. సరిహద్దుల నిర్ణయానికి సంఘాన్నొకదానిని ఏర్పాటు చేయాలనీ, ఉభయ దేశాల మధ్య గల సమస్యలను సంప్రదింపులు, రాజీ - తప్పితే మధ్యవర్తి తీర్పు ద్వారానే పరిష్కరించుకుందాము గాని ఒకదానిపై నొకటి యుద్ధానికి పూనుకోము అని ఉభయ ప్రభుత్వాలూ ఒక ప్రకటన చేయాలనీ, మహమ్మదలీ ఆ జాబులో సూచించారు.

నిర్యుద్ధ ఒడంబడిక జరగాలన్న సూచనను మొట్టమొదట భారత ప్రభుత్వం ఆరు సంవత్సరాల క్రిందటే చేసిందనీ, కాని పాకిస్తాన్ ప్రభుత్వం అప్పుడాసూచనను నిరాకరించిందనీ ప్రధాని నెహ్రూ 21వ తేదీ జాబులో జ్ఞాపకం చేశారని తెలుస్తోంది.

సరిహద్దుల నిర్ణయం విషయంలో 1955 లో జరిగిన పంత్ మీర్జా ఒప్పందం దాన్ని అమలుజరపాలని కూడా ఆ జాబులో నెహ్రూ సూచించారట.

గుంతకల్లు నూలును చౌక రేట్లకు సప్లయి చేయాలి

సహకార శాఖ పద్దుపై శాసనసభ చర్చలో శ్రీ పుత్సల సత్యనారాయణగారి విజ్ఞప్తి

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మార్చి 28

చేనేత సొసైటీలలో లడ్డికి 0-8-0 కనీస వేతనంగా నిర్ణయించాలని, సహకార సంఘాలలో లేని చేనేతవారికి మాస్టర్ వీవర్లకు డబ్బు పరపతినీ, బట్ట విడుదల సౌకర్యాలను కలిగించేందుకై మార్కెటింగు సొసైటీలు ఏర్పరచాలనీ, గుంతకల్లు నూలు మార్కెట్ రేటుకన్న చౌకగా సొసైటీలకు నూలు సప్లయి చేయాలనీ సహకార పద్దుపై చర్చ ప్రారంభించిన శ్రీ పుత్సల సత్యనారాయణగారు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

నేను చేనేత సెస్సు ఫండుతో అమలు జరుపబడుతున్న పథకాలలో డబ్బు దుర్వినియోగమవుతున్న విషయం 1953-54, 54-55 సంవత్సరాల సెస్సు పథకాల నివేదిక వల్ల స్పష్టమవుతున్నదన్నారు. నివేదికలో ఇలా ఉంది:

"వాటాధనంక్రింద ఇచ్చిన 4 లక్షల 75 వేలలో 3 లక్షల 65 వేలు మాత్రమే అంటే 76.5% మాత్రమే వినియోగించారు. పెట్టుబడికై ఇచ్చిన 18 లక్షలలో 7 లక్షలే అంటే 4% మాత్రమే వాడారు. మిగతా మొత్తం మురిగిపోయింది. కాని అజమాయిషీ పనికని రు. 47,500 కేటాయిస్తే లక్ష 10 వేలకు పైన ఖర్చు పెట్టారు. సెంట్రల్ గోడౌన్సు - ఇదొక తెల్ల ఏనుగు. దీనికి కేటాయించిన మొత్తానికి రెట్టింపు ఖర్చుపెట్టారు. పరిశోధనలకు ఇచ్చిన రు. 35 వేలలో 2 వేలే వినియోగించారు. ఈవిధంగా అసలు పనికై పెట్టిన ఖర్చు తగ్గించి, అధికారుల జీతభత్యాలు, ఇతర దుబారా వ్యయం పెరిగింది."

జీవనప్రమాణం పెరగలేదు

ప్రభుత్వం ఏమి చెప్పినప్పటికీ చేనేత పారిశ్రామికుని జీవనప్రమాణం పెరగలేదనీ నేను సహకారసంఘాలలో లడ్డికి కనీసవేతనంగా నిర్ణయించిన రు. 0-6-0 ను, 0-8-0 కు పెంచవలసిన అవసరమున్నదనీ అన్నారు. సహకార సంఘాలలోలేని చేనేత పారిశ్రామికులు నూటికి 80 మంది వరకు ఉంటారనీ, వీరందరూ చిన్న చిన్న మాస్టర్ వీవర్ల క్రింద పనిచేస్తున్నారనీ అన్నారు.

"స్వతంత్రంగా పని చేసుకొంటున్న చేనేత పారిశ్రామికులు, మాస్టర్ వీవర్లు తమ సరుకులు అమ్ముకోలేకున్నారు. తగిన పెట్టుబడి లేనందువల్ల, బట్ట విడుదల కానందువల్ల వీరుతయారు చేస్తున్న లేక తయారు చేయిస్తున్న గుడ్డను వర్తకులు చౌకగా కొనగలుగుతున్నారు. ఇందువల్ల చేనేత పారిశ్రామికులందరూ సహకార సంఘాలలో చేరే అవకాశాలుకలిగేంతవరకూ ఈ మాస్టర్ వీవర్లకుకూడ ఈరంగంలో స్థానమున్నది. కాబట్టి వీరందరి సౌకర్యంకోసం సహకార విక్రయసంఘాలు ఏర్పరచి, వీరి సరుకులు విడుదల కావడానికీ, దళారీలను తొలగించడానికీ ప్రభుత్వం పూనుకోవాలని కోరుతున్నాను."

ద్వారపూడి సంతలో 4½ కోట్ల విలువచేసే చేనేతబట్ట అమ్మకమవుతుందనీ, అక్కడ లక్షరూపాయలతో చేనేత విక్రయ ప్రదర్శనశాలను కట్టించాలని కోరారు.

సహకారచట్టాన్ని సవరిస్తూ విశాలాంధ్ర ఏర్పడేలోగానే శాసనం తేవాలన్నారు. వీలయినంత ఎక్కువమంది చేనేతవారిని సహకార సంఘాలలో చేర్చుకోవాలని సూచిస్తూ కనీసం వర్కింగ్ పెట్టుబడి తెచ్చుకో గలిగిన [illegible] తప్పనిసరిగా చేర్చుకొనే ఏర్పాట్లు చేయాలని కోరారు.

సహకారశాఖ దుస్థితి

శ్రీ మంతెన వెంకట్రాజుగారు మాట్లాడుతూ, సహకారశాఖ ఒక అభాగ్యశిశువు లాగా ఉన్నదన్నారు. "సహకార సంఘాలకే కూపులివ్వాలని ఈ సూత్రం ఉన్నది. అయితే ఫారెస్టుశాఖవారు దాన్ని పాటిస్తున్నారా? లేదు. పైగా ఆసంవత్సరమున్న ధరలు గమనించకుండా ఐదేండ్ల సరాసరి లెక్కవేసి ఆ ప్రకారం డబ్బు వసూలు చేస్తున్నారు. ఇందువల్ల దివాళా తీసిన సంఘాలున్నవి. కుటీర పరిశ్రమలకని సంఘాలు పెడతారు. సెంట్రల్ బ్యాంకు అప్పు ఇస్తుంది. డబ్బు మటుమాయమవుతుంది. నష్టం భరించేది సెంట్రల్ బ్యాంకు. ఎరువులు పంపకం సహకార సంఘాలకు ఇస్తామంటున్నారు. అయితే ఇవి ఎలా పంచాలి? మొదలగు విషయాలకు అధికార కమిటీలు వేస్తున్నారు. ఉద్యోగులను రైతుల నెత్తినై ఎక్కించే ఈ మార్గం వదలదని నేను చెప్పుతున్నమాట ఎవరూ పట్టించుకోవడంలేదు" అన్నారు.

శ్రీ పప్పూరి రామాచార్యులుగారు మాట్లాడుతూ ఒకే గ్రామంలో అనేక [illegible] సంఘాలు పెట్టుకొనివ్వాలన్నారు. వాటా ధనం లేకపోయినా సొసైటీలకు అప్పు ఇవ్వాలని ప్రభుత్వం నిర్బంధిస్తున్నందువల్ల సెంట్రల్ బ్యాంకులు కొన్ని సంఘాలకు అప్పిచ్చి లక్షలు నష్టపోతున్నవి. మా అనంతపురం బ్యాంకు ఈవిధంగా లక్షా 50 వేలకు గుండుసున్న చుట్టుకోవలసివుంది. ప్రభుత్వం ఈ విషయంలో ఇస్తామన్న గ్యారంటీలు కాగితంపైనే నిల్చిపోయాయి. అప్పులు మంజూరుచేసే అధికారులకు అప్పు వసూలుచేసుకోవడంలోను, పురస్కారం చేసుకోవడంలోను అధికారం లేదు. ఇవి అధికారులకే వదలివేయరాదు. సెంట్రల్ బాంకులను అప్పుల వసూళ్ళనుబట్టి, ఎ. బి. సి. తరగతులుగా నిర్ణయించటం తప్పు. ఇందువల్ల హరిజనులు, ఇతర పేదలు పెట్టుకొన్న సంఘాలపై ఒత్తిడి చేసి బ్యాంకులలో డబ్బు వసూలు చేయడం జరుగుతున్నది. ఇది సహకారోద్యమ సూత్రాలకే విరుద్ధం అన్నారు.

బొజ్జా అప్పలస్వామి (కాం): సహకార సంఘాల విషయంలో మనం అనుసరించే విధానాన్ని పరిశీలన చేయడానికి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ ఒక సబ్‌కమిటీ వేసింది. అది ఏమి పనిచేసిందని అడిగారు.

సంజీవయ్య: పార్టీ వ్యవహారాలు ఇక్కడ తీసుకొని రావద్దండి.

ఫీల్డ్ లేబర్ సొసైటీలు

శ్రీ అప్పలస్వామి: తీసుకొని రాక తప్పదు. నేను 1952 లో ఎన్నికయినప్పటినుంచి చెప్పుతున్నాను. పోరంబోకులు, లంకలు సాగు చేసుకొంటున్న సొసైటీలకు చాలా అన్యాయం జరుగుతున్నది. నేడు ఇళ్లూ, గుళ్ళుకట్టుకొనివున్న హరిజనులు అక్కడ వుండడానికికూడా ఆస్కారం లేకుండా పోతున్నది. లంకభూముల్లో పశుగ్రాసానికై 3 వ పాట వేలం పాడాలని నిర్ణయించారు. జరుగుతున్నదేమి? ఉన్న భూముల్లో శ్రేష్ఠమైనవి ఏరి, వాటిని వేలం పాడుతున్నారు. చౌటిపర్రలు, ఎందుకు కొరగాని భూములు ఫీల్డు లేబర్ సొసైటీలకు కౌలుకిస్తున్నారు. ఇవ్వడంలో విపరీతమైన కౌలురేటు వసూలు చేసి ఆ సంఘాలను దివాళాతీయిస్తున్నారు.

కాంగ్రెస్ సభ్యులు: వినండి: వినండి.

"నా కొంపకు దరఖాస్తు"

శ్రీ అప్పలస్వామి: వినండి వినండి అని చప్పట్లు చరిస్తే ప్రయోజనంలేదు. జమీందారుల చేతిలోను భూస్వాముల చేతుల్లోను ఉన్న భూములు ఇవ్వకపోతే పోనీ ప్రభుత్వం తన చేతిలో ఉన్న పోరంబోకులు, లంకలు ఇవ్వమంటే ఇదీ ప్రభుత్వం జవాబు. నా తమ్ముడు 3 ఏండ్ల క్రిందట భూమి తనఖా బ్యాంకులో అప్పుకు పెట్టుకొన్న దరఖాస్తు, ఎం. ఎల్. ఏ. నైన నేను విశ్వప్రయత్నం చేసినా నిన్నటివరకూ మంజూరు కాలేదు. నేను కొంప కట్టుకోడానికై పెట్టుకొన్న దరఖాస్తు ఇంతవరకు అతీ గతీ లేదు. ఇక సామాన్యుడైన హరిజనుని అవస్థ ఎలా ఉంటుందో మీరే ఊహించండి.

శ్రీ బత్తిన సుబ్బారావుగారు మాట్లాడుతూ ఏ మినహాయింపు లేకుండా అన్ని దేవాదాయ భూములు ఫీల్డులేబర్ సెటిల్‌మెంట్ సంఘాలకు కౌలుకివ్వాలన్నారు.

శ్రీ ప్రగడ కోటయ్యగారు మాట్లాడుతూ యిలా అన్నారు.

"కేంద్ర ప్రభుత్వం ఆమోదం కోసం వేచివుండకుండా వెంటనే చేనేతసంఘాలకు ఒక ఆర్థిక సహాయక సంస్థను ఏర్పరచాలి. అందుకవసర మయ్యే పెట్టుబడి మేమే సేకరిస్తాం. ఇందుకు వెంటనే ఒక స్పెషల్ ఆఫీసరును వేయాలి. గుంతకల్లు నూలు మిల్లు తక్కువధరకు నూలు సప్లయి చేస్తే ఆ సౌకర్యం దుర్వినియోగం చేయబడుతుంది. కుటీర పరిశ్రమకు సహకార సంఘాలకు నమూనా ప్లాన్ లేనందువల్ల రిజిస్టరు కాలేదు. ఈ ప్లాన్ తయారు చేయించాలి.

సరిపడినప్పుడూ, ఒకే సంఘంలో అందరినీ చేర్చడంకన్న వేరు వేరు సంఘాలుండడం మంచిది. సహకార శాఖకు భూములివ్వడంలోను, ఇతర విషయాల్లోను అధికారాలు లేనందువల్ల సహకార, రివెన్యూ, వ్యవసాయ అటవీ శాఖాధికారులతో ఒక సమన్వయ కమిటీ వేయాలి.

* * *

సింహళంలో బుద్ధ జయంతి ఉత్సవాలకు జపాన్ 35000 పౌనులను విరాళం యిచ్చింది.

ఫారెస్టు ఉద్యోగులచే రైతు కూలీల దోపిడీ

ప్రభుత్వం అరికట్టాలని శాసనసభలో భద్రాచలం సభ్యుడు శ్రీతహసీల్ విజ్ఞప్తి

(విశాలాంధ్ర విలేఖరి)

కర్నూలు, మార్చి 28

భద్రాచలం ఫారెస్టుఉద్యోగులు రైతులనుంచి లంచాలు గుంజి, కూలీలకు ప్రభుత్వంకన్న తక్కువ రేట్లు ఇచ్చి అటు వారిని దోపిడీచేయడం, ఇటు ప్రభుత్వానికి నష్టం కలిగించడం చేస్తున్నారని భద్రాచలం కమ్యూనిస్టుసభ్యుడు మహమ్మద్ తహసీల్ నేడు శాసనసభలో వివరించారు.

ఫారెస్టుపద్దుపై నేడు శాసనసభలో చర్చజరిగిన సందర్భంలో మహమ్మద్ తహసీల్ మాట్లాడుతూ ఇలా అన్నారు:

ఏజన్సీ ప్రాంతంలో 10 వేల ఎకరాల వర్జీనియా పొగాకు వేస్తున్నారు. నేయిపొగాకుబేరన్లున్నాయి. వీటికి సకాలంలో వంటచెరకుఅందాలి. లేకపోతే పొగాకు పాడైపోతుంది. ఇది అవకాశంగా తీసుకుని బేరన్‌కి 50 రూపాయల వంతున లంచం తీసుకుంటున్నారు. ఇప్పుడు పొగాకు ధరతగ్గిందని 40 రూపాయలు వసూలు చేస్తున్నారు. అంతేకాక ప్రతి బేరన్‌కీ ఒక కేసు పెట్టివ్వాలని నిర్బంధిస్తున్నారు. ఈ విధంగా రైతులు లంచం ఇచ్చుకోవలసిరావడం, ప్రభుత్వానికి నష్టం కలగడం జరుగుతోంది. అందుచేత ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని, వంటచెరకు సకాలంలో అందేట్లు చూడాలి.

కూపులపై దోపిడీకూడా విపరీతంగా సాగుతున్నది. అప్పర్ గోదావరి డివిజన్‌లో ప్రభుత్వమే కూపులు వేస్తున్నది. కూనవరంలోగల మూడు కూపులకు గత రెండు మాసాలలో రేంజి ఆఫీసరు 7629 రూపాయల లాభం గడించాడు. ఈ కూపులు వేయడానికి చెట్లు నరికేటపుడు ఒక ఘనపుటడుగుకు రెండణాలు ప్రభుత్వం రేటయితే, కూలీలకు అణాయే చెల్లిస్తున్నారు. కొండమీదినుంచి క్రిందికి కలప తీసుకురావడానికి ఘనపుటడుగుకి రెండణాలు ఇవ్వాల్సివుండికాని తక్కువే ఇస్తున్నారు. (ఇంకా మరికొన్ని అంకెలుకూడా తహసీల్ గారు ఇచ్చారు.)

అన్‌రిజర్వుడు ప్లాటులో కూడా సుమారు 6800 రూపాయలు మిగుల్చుకున్నారు. కూనవరంనుంచి రాజమండ్రికి కలప దిగుమతి చేయాలంటే ప్రభుత్వ రేటు అర్ధ రూపాయి వంతున ఇవ్వాలి. కాని ఇందులో సగంమాత్రమే ఇస్తున్నారు. కూనవరం రేంజిలోనే ఇంతమొత్తం సంపాదించివుంటే, మొత్తం ఆరు రేంజీలలో ఎంత సంపాదించి వుండవచ్చో ఊహించవచ్చు.

రోడ్లు కూడా ఫారెస్టు అధికారులే వేస్తున్నారు. భీమవరం నుంచి బూరుగువాడకు, కోలిపాకనుంచి తాటివంకకు, ఏటిపాకనుంచి తునికిచెరువుకు 15 మైళ్ళ యూనిట్‌కి ప్రభుత్వం మైలుకు 21-12-0 వంతున ఇస్తుండే అధికారులు 15 రూపాయలే ఇస్తున్నారు. ఈ విధంగా విస్తారంగా డబ్బు మిగుల్చుకుంటున్నారు. కూలీలకు న్యాయంగా డబ్బుఅందేట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

కూనవరంనుంచి చింతూరువరకుగల ప్రాంతాలలో, శబరీనదిలో చేపలు పట్టే హక్కును ఒక షావుకారు 50 రూపాయలకు వేలంలో పాడాడు. చేపలు పట్టడానికి వచ్చే కోయ, బెస్తలనుంచి ఒక్కొక్కరివద్ద 5-10 రూపాయల చొప్పున అతడు వసూలు చేస్తున్నాడు. ప్రజల్ని ఈవిధంగా దోపిడీ చేస్తున్నవారి చర్యలను అరికట్టాలి."

డాక్టరు గోపాలరెడ్డి 'ఆపరేషన్లు'

కర్నూలు, మార్చి 29

ఆంధ్ర అసెంబ్లీలో ఈనాడు ఆపరేషన్ డాక్టర్ల ప్రస్తావన వచ్చింది. శ్రీ గున్నయ్యగారు జోక్యం కల్పించుకొని ఇలా అన్నారు.

"గోపాలరెడ్డిగారు కూడ డాక్టరే కదా! ఆయన రైతులకు ఎన్ని ఆపరేషన్లు చేశారు? అవి రైతులకు ఎంతవరకు ఉపయోగపడ్డాయి?"

(పి. వి.)

అరబ్బు దేశాలతో చైనా వర్తకాభివృద్ధి

హాంకాంగ్, మార్చి 28

ఈజిప్ట్, సిరియా, లెబనాన్ దేశాలతో చైనా ఇదివరకే వర్తక ఒడంబడికలు చేసుకుంది. ఈ మూడు దేశాలే కాకుండా, తక్కిన అరబ్బు దేశాలతో కూడా చైనా వర్తకం పెంపొందేందుకు చాలమంచి అవకాశాలు ఉన్నాయని చైనా విదేశ వర్తక శాఖ అధికారి హ్సియా యావో చౌ 'క్వాన్మింగ్ డెయిలీ' అనే పత్రికలో వ్యాసం రాస్తూ తెలిపారు. "సౌదీ అరేబియాతో వర్తకసంధి ఇంకా జరగలేదు, కాని, ఉభయదేశాలు ప్రయత్నిస్తే ఇది త్వరలోనే సాధ్యమ"ని ఆయన రాశారు.

నాగార్జున సాగర్ ప్రారంభోత్సవానికి అయిన ఖర్చులు

కర్నూలు, మార్చి 29

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రు. 68,700 లు ఖర్చు అయిందని ఈ సందర్భంలో ప్రాజెక్టు నిర్మాణస్థలంలో జరిగిన విందు సందర్భంలో శాసన సభ్యుల పట్ల ఎట్టి వివక్షత చూపలేదని ఉప ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నేడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు.

నాగార్జునసాగర్ బోర్డు నిర్ణయం ప్రకారం ఈ ఖర్చు ప్రభుత్వ ఖాతాలోనే వ్రాశారనీ, ప్రాజెక్టు అంచనాలలో వ్రాయలేదని అన్నారు.

నాగార్జునసాగర్ ప్రారంభోత్సవానికి నెహ్రూ వచ్చినందుకైన ఖర్చు రు. 22,735-1-0 అని ముఖ్యమంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు మరో ప్రశ్నకు సమాధాన మిచ్చారు.

శ్రీ నెహ్రూ కర్నూలు వెళ్ళారు. గుంటూరు రాజకీయసభను ప్రారంభించారు. ఈఖర్చులలో రాష్ట్రంలోనివివిధ ప్రాంతాల నుండి బాలలను రప్పించి ప్రధాని సమక్షంలో క్రీడా ప్రదర్శనం జరిపించినందుకు, కర్నూలు గుంటూరులలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినందుకు అయిన ఖర్చులు కూడా ఉన్నాయి.

1954-55 లో గుంటూరులో హైకోర్టు ప్రారంభోత్సవానికి, ఆంధ్రరాష్ట్ర ప్రథమ వార్షికోత్సవం, స్వాతంత్ర్యదినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవం, సెక్రటేరియట్ నూతన భవన ప్రారంభోత్సవాలకు మొత్తం రు. 26800 అయిందని ముఖ్యమంత్రి తెలియజేశారు.

విశాలాంధ్ర సరిహద్దుల సర్దుబాటులు

వివిధ పార్టీల ప్రతినిధులతో హైద్రాబాదు ముఖ్య మంత్రి చర్చలు

హైద్రాబాద్, మార్చి 28

నిన్న సాయంకాలం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు తెలంగాణాకు చెందిన అన్ని పార్టీల శాసనసభ్యులతో ఇష్టాగోష్ఠి జరిపారు. ప్రధానంగా రాష్ట్ర పునర్విభజన బిల్లుకు సంబంధించి వివిధ సమస్యల్ని గురించి చర్చించినట్లు తెలుస్తోంది.

సరిహద్దుల విభజన సమస్యలపై తెలంగాణాకు కర్ణాటక మరాఠ్వాడాలకు మధ్య అవలంబించవలసిన విధానం మీద చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.

మరాఠ్వాడా నాయకులు రెవిన్యూ ఫిర్కాలవారీగా సరిహద్దుల విభజనకు సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని కిన్వట్, రాజూరాలో కొంత భాగం మరాఠ్వాడాకు చేరవలసివుంది. నాందేడ్‌లోని మధోల్, మరికొన్ని సరిహద్దు భాగాలూ, తెలంగాణాకు పోవలసి వుంటుంది. ఇక్కడ ఇచ్చి పుచ్చుకోడాలు సరిసమానంగానే వుంటూండడంచేత మహారాష్ట్రులు సర్దుబాట్లు గ్రామాలవారీగా జరగాలన్నా వ్యతిరేకులుకారని తెలుస్తోంది.

కాని, కర్ణాటకులతో సమస్యవేరు. తెలుగు ప్రాంతాలూ, హెచ్చు ప్రాముఖ్యాల గలవీ ఇప్పుడు కర్ణాటక భాగంలో చేరిన రాయచూర్, [illegible]లలో మిగిలి పోయాయి. తెలుగు జిల్లాలలో మిగిలిన కర్ణాటక గ్రామాలు చాల తక్కువ.

అందుచేత వారు ప్రస్తుతపు సరిహద్దుల సర్దుబాట్లు పనికిరావంటున్నారు.

ఈ ప్రాంతాలు తాము వదలుకోక పోవడమేగాక వాని అభివృద్ధికి తోడ్పడే ప్రాజెక్టులను ప్రారంభించడానిక్కూడా వారు విముఖత తెలుపుతున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు రాజులబండ ప్రాజెక్టు. ఇది రాయచూరు జిల్లాలోవుంది. దీని నిర్మాణం వలన తెలంగాణా ప్రాంతంలో 4-5 లక్షల ఎకరాలు సాగౌతే, 7-8 వేల ఎకరాలు మాత్రమే కర్ణాటక భాగంలో సాగవుతుంది. కనక దానిభారం తమ కక్కర్లేదంటున్నారట. ఆ స్థితిలో రాయచూరు జిల్లాలోని తెలుగు ప్రాంతాలను వదలుకోవాలని ప్రతిపాదిస్తున్నారట. ఇదేస్థితి దేవనూర్ ప్రాజెక్టు విషయంలోకూడా.

కర్ణాటకుల అర్థంలేని ఈపట్టుదలకు తెలంగాణా క్షేమంకరులమని చెప్పుకునే రంగారెడ్డి ముఠావారు ప్రోత్సహిస్తూండడం గమనించదగివుంది.

నూతనంగా ఏర్పడబోయే రాష్ట్రం పేరు సమస్య చర్చలోకి వచ్చిందట. సభలో కొందరు ఆంధ్ర ప్రదేశ్ పేరును సూచించారట. రంగారెడ్డిగారికి ఈ పేరు ఏ మాత్రమూ ఇష్టం లేదు. వారి ముఠావారు తెలుగు ప్రదేశ్ పేరు సూచిస్తున్నారు.

చర్చలో వచ్చిన మరో అంశం ఎగువ శాసనసభ. కాంగ్రెసు సభ్యులంతా దానిని బలపరిచేరనీ, ప్రతిపక్షంలో - ఫ్రంట్‌తోసహా - కొందరిటూ కొందరటూ వాదించేరని వినిపిస్తోంది.

చర్చలో ప్రధానస్థానం ఆక్రమించిన సమస్య ఎన్నికల సమస్య.

ప్రస్తుతం బిల్లు ప్రకారం తెలంగాణాలో జరగగల ఎన్నికలు మూడేళ్ళకే పరిమితం. మళ్ళీ ఆంధ్రతో పాటు ఎన్నికలు జరగవలసివుంటుంది. దానికి తెలంగాణా సభ్యులు వ్యతిరేకించేరని తెలిసింది. కావలిస్తే ఆంధ్రలో ఇప్పుడే ఎన్నికలు జరపమందామన్నారట. ఆ ప్రతిపాదనకు ఆంధ్ర శాసన సభ్యులంగీకరించరని, కేంద్రం వారనిప్పుడు కదిలించేదశలో లేదని ముఖ్యమంత్రి అన్నారట.

అయితే తెలంగాణా ఎన్నికలు ఆంధ్రతో పాటే జరిగించేటందుకు ఇప్పటి శాసనసభ్యుల గడువు పొడిగించనున్నారట. ఎన్నుకోబడే తెలంగాణా సభ్యుల కాలపరిమితి 5 ఏళ్ళకు తగ్గరాదనే తమ కోరికను కేంద్రం మన్నించిందనీ, కాని ఇప్పుడు మరల మాటతప్పిందని శ్రీ రంగారెడ్డి విసుక్కున్నారట. ఈ విషయంలో కేంద్రం నుంచి వివరాలు తెలుసుకోవాలన్నారట. అంటే ఆయన అభిప్రాయం ప్రకారం శాశ్వతంగా రాబోయే విశాలాంధ్రలో వేర్వేరు ప్రాంతాలకు వివిధ సమయాల్లో జనరల్ ఎన్నికలు జరగాలని తోస్తోంది. బహుశా తెలంగాణా ప్రత్యేక వ్యవస్థ కదో చిహ్నం కాగలదని భావిస్తున్నట్లు తోస్తుంది.

సమస్యలపై వివిధ సభ్యుల దృక్పథాలు తెలుసుకొనేటందుకే ఈ సమావేశం జరిగించనీ, కర్ణాటక, మహారాష్ట్ర సభ్యులతో కూడ ముఖ్యమంత్రి ఇటువంటి సమావేశాలు జరుపుతారనీ తెలుస్తోంది.

లోక్‌సభలో భాషా సమస్య

హిందీ ప్రశ్నలకు హిందీలోనే జవాబులు

న్యూఢిల్లీ, మార్చి 28

ప్రశ్నలు హిందీలో అడిగినప్పుడు జవాబులుకూడా హిందీలోనే చెప్పాలనే సాంప్రదాయం కలదని నేడు ప్రధాని నెహ్రూ లోక్‌సభలో మంత్రులకు హెచ్చరిక చేశారు.

శ్రీ యస్. యన్. దాస్ హిందీలో ఒక ప్రశ్నకు నోటీసు యిచ్చారు. కాని దానికి జవాబు ఇంగ్లీషులో చెప్పబడింది. అది శ్రీ నెహ్రూకే వేయబడింది. అప్పుడాయన తాను ఇంగ్లీషులోగాక, హిందీలోనే చెబుతానని అలాగే చెప్పారు. స్పీకర్ కోరినపక్షంలో తాను చెప్పిన దాని సంగ్రహాన్ని ఇంగ్లీషులో చెప్పగలనన్నారు.

శ్రీ దాస్ తన ఉప ప్రశ్నలన్నింటినీ హిందీలోనే అడిగారు. వాటన్నిటికీ నెహ్రూ హిందీలోనే జవాబుచెప్పి, ఆ తరువాత ఆ జవాబులన్నింటి సంగ్రహాన్ని ఇంగ్లీషులో చెప్పారు.

బజారు ధరలు

విజయవాడ; మార్చి 29

(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం ధరలు

మేలిమి పాట్లా		106 0 0
మూసా		105 8 0
నకరు		68 0 0
వెండి 100 తులములు		184 0 0
1 తులము		1 14 0

ధాన్యం ధరలు

24 నెంబరు		24 8 0
కంకసన్నాలు		22 12 0
12 నెంబరు		22 4 0
అక్కుళ్ళు		22 4 0
కుసుమ		29 2 0
కోణామణి		22 2 0

బియ్యం ధరలు

24 నెంబరు		54 0 0
కంకసన్నాలు		52 8 0
12 నెంబరు		50 0 0
అక్కుళ్ళు		50 0 0
కుసుమ		49 12 0
కోణామణి		49 12 0

అపరాల ధరలు

మినుములు 240 పౌనులు		56 8 0
కందులు	36/-	38 0 0
నల్లపెసలు(మాగాణి)	40/-	42 0 0
పచ్చపెసలు 230 పౌ॥		43 0 0
పచ్చపెసలు(మెట్టవి)	42/-	43 0 0
శనగలు (దేశవాళీ)		38 8 0
శనగలు (పంజాబు)		35 0 0
వనియాలు 90 పౌనులు		32 0 0
ఉలవలు		31 0 0
ఆముదాలు		38 0 0
పంచదార (ఉయ్యూరు)		88 5 3
బెల్లం మణుగు	3 8 0	4 8 0
మిర్చి(వైజాగు) ,,	17-0-0	23 0 0
మిర్చి దేశవాళీ ,,		28 0 0
నీరుల్లి ,,		1 4 0
తెల్లుల్లి ,,		6 8 0
చింతపండు(మణుగు)	4-5-0	7 8 0
నువ్వుల నూనె (మణుగు)		21 0 0
కొబ్బరినూనె డబ్బా		25 0 0
వేరుశనగపప్పు 177 పౌ॥	56-8-0	59 8 0
,, నూనె మణుగు		15 14 0
,, కేక్ 160 పౌ॥		14 6 0
,, మడ్డిపిండి 160 పౌ॥		16 8 0
కొబ్బరికాయలు1,000		135 0 0
పసుపు పుట్టి	150/-	230 0 0
పంచులు 100		105 4 0
,, ఫార్వర్డు		100 0 6

చారిత్రక నవల

ప్రతాపరుద్రీయం

రచన: పొన్నలూరి రాధాకృష్ణమూర్తి

216 పేజీలు 2—4—0

పోస్టేజి అదనం

ప్రచురణ

విశాలాంధ్ర ప్రచురణాలయం

బకింగ్‌హామ్‌పేట పోస్టు - - విజయవాడ - 2

పీపుల్స్ బుక్ హౌస్

నిజాంషాహిరోడ్డు - - హైద్రాబాద్

రేపల్లెతాలూకా అభివృద్ధికి సత్వర చర్యలు

తీసుకోవాలని తాలూకా అఖిల పక్ష మహాసభ అభ్యర్థన

రేపల్లె, మార్చి 27

రేపల్లెతాలూకా అభివృద్ధికి సత్వరచర్యలు తీసుకోవాలని కోరుతూ తాలూకా అఖిలపక్ష మహాసభ తీర్మానించింది.

గుంటూరుజిల్లా రేపల్లె తాలూకాలో అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహించటమేందుకు కృషి చేయుటకై అన్ని పార్టీలకు చెందిన ప్రముఖులు ఒక అభిప్రాయానికి వచ్చారు. కాంగ్రెసు పార్టీకి చెందిన శ్రీయుతులు డాక్టర్ చల్లపల్లి మురహరరావు, యల్లాప్రగడ వెంకటరమణరావు, చిట్టినేని రాఘవయ్య, వి. నాగయ్యచౌదరి మొదలైనవారు కమ్యూనిస్టుపార్టీకి చెందిన శ్రీ పమిడిముక్కల లక్ష్మణరావు, ముత్తురెడ్డి శ్రీరాములు, కంఠంనేని వెన్నెధరావు గార్లు సోషలిస్టుపార్టీకి చెందిన శ్రీ కె. గోపాలకృష్ణయ్య, ప్రజాపార్టీకి చెందిన శ్రీ బలిజేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, రేపల్లె పంచాయితీ అధ్యక్షులు శ్రీ సేతి వెంకటరమణ, శ్రీ మండలి సుబ్రహ్మణ్యం (బి. ఏ. బి. యల్.) మరి కొంతమంది పంచాయితీ అధ్యక్షులు కన్వీనర్లుగా వుండి, తాలూకా అభివృద్ధి మహాసభను మార్చి 23వ తేదీన శ్రీ కృష్ణాటాకీసులో, రేపల్లెలో జరిపారు.

ఈ మహాసభకు అన్ని పార్టీలకు చెందిన ప్రముఖులు, ప్రజలు హాజరయ్యారు. ఈ సభకు శ్రీ సేతి వెంకటరమణగారు అధ్యక్షత వహించారు. ఈ సభ జయప్రదం కావాలని తాలూకాలోని శాసనసభ్యులు శ్రీ అనగాని భగవంతరావు, శ్రీయడం చెన్నయ్య, మాజీ శాసనసభ్యులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణగార్లు సందేశాలు పంపారు.

తాలూకాలోగల రోడ్లు, నీటి సౌకర్యం, మురుగు సౌకర్యంగాగల విషయాలపై శ్రీయుతులు సేతి వెంకటరమణ, సిద్దాబత్తుని దుర్గయ్య, బలిజేపల్లి సుబ్రహ్మణ్యం, మండలి సుబ్రహ్మణ్యం, పార్వతీశం, పర్చూరి వెంకటరత్నం, కొరటాల సత్యనారాయణగార్లు, తదితరులు మాట్లాడారు. రాజకీయ విభేదాలు లేకుండా తాలూకా అభివృద్ధికి ఐక్య కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. చర్చల అనంతరం యీ క్రింది తీర్మానాలు చేశారు.

— రేపల్లె తాలూకాలో అత్యధిక భాగం అన్ని విషయాలలోను వెనుకబడివున్నది. రోడ్డు సౌకర్యం చాలా భాగానికిలేదు. అందువలన రేపల్లె తుమ్మలరోడ్డు హైవేసులో చేర్చాలి. ఆ రోడ్డును మోళ్ళగుంట వరకు పొడిగించాలి. అలాగే రేపల్లె ఆడవులదీవి రోడ్డును హైవేసులో చేర్చి దాన్ని కొత్తపాలెం వరకు పొడిగించాలి.

— రేపల్లె-పిట్టలవానిపాలెంరోడ్డు నగరం వరకే వినియోగ పడుతున్నది. ఆ రోడ్డులో 10-13 మైళ్ళమధ్య మెటల్ వేయించి రేపల్లె - బాపట్ల తాలూకాలకు రవాణా, రహదారీ సౌకర్యం కల్పించాలి.

— పెల్లటూరునుండి - ఆడవిపాలెంలాకు వరకు బ్యాంకు కెనాల్ కట్టపై రోడ్డు వేయాలి.

— రేపల్లె - నిజాంపట్నం రోడ్డు నంగేటి రేవువరకు మాత్రమే ఉపయోగంలో వున్నది. అందువలన నంగేటిరేవు, తాటికాయల రేవులకు కల్వర్టులు నిర్మించి ఆ రోడ్డును వినియోగంలోకి తేవాలి.

— తెనాలి రేపల్లె తాలూకాల మురుగు అంతా రేపల్లె తాలూకాలోని రేపల్లె, భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్సు ద్వారా సముద్రంలో కలుస్తుంది. అందువలన ప్రతి సంవత్సరం మురుగువల్ల తాలూకా రైతాంగం బాధ పడుతుంది. కాబట్టి రేపల్లె, భట్టిప్రోలు డ్రెయిన్సును పరిచేసి ముంపు నివారణకు పూనుకోవాలి.

— తాలూకాలో ఆయకట్టులో చేరకుండా వేల ఎకరాల సాగు అవుతున్నది. కృష్ణా బ్యారేజి నిర్మాణం దృష్ట్యా యిప్పుడు సాగు అవుతున్న దాన్ని పర్మినెంటు ఆయకట్టులో చేర్చాలి. కృష్ణా బ్యారేజి నిర్మాణం పూర్తి అయ్యేనాటికి అదనపు నీటి సౌకర్యం నిమిత్తం తాలూకాలో ముఖ్యంగా పైలాండు ప్రాంతంలోవున్న కాల్వలను పొడిగించడం కొత్త కాల్వలను త్రవ్వడం పూర్తి చేయాలి.

— రేపల్లెలోని పశువైద్యశాలను [illegible]చేసి ఒక డాక్టరును అపాయింటు చేయాలి.

— రేపల్లెలో వున్న జిల్లాబోర్డు ఆసుపత్రి ప్రజలకు ఉపయోగించడం లేదు. దాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రిగా మార్చి మందులు వస్త్రాలు పంపుతూ, ఒక లేడీ డాక్టరును విధిగా నియమించాలి.

— తాలూకా ప్రజల అవసరాన్ని గమనించి రేపల్లెలో బాలురకు, బాలికలకు సెకండరీ గ్రేడ్ ట్రైయినింగు స్కూలు పెట్టాలి.

— తాలూకాలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. తెనాలినుండి అగ్నిమాపకదళం రావలసివస్తున్నది. దూరంనుండి రావడంవల్ల సక్రమంగా ఉపయోగించుటలేదు. అందువలన రేపల్లె పట్టణంలో ఫైర్ సర్వీసును పెట్టాలి.

— ముఖ్యమైన అన్ని తాలూకా ముఖ్యపట్టణాలకు విద్యుచ్ఛక్తి ఉన్నది. రేపల్లెతాలూకాకు మాత్రం విద్యుచ్ఛక్తి లేదు. అందువల్ల రేపల్లె పట్టణానికి, బాయ్ కెనాల్ ఒడ్డునవున్న గ్రామాలలో వ్యవసాయానికి విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలి.

రేపల్లెతాలూకాలో గణనీయమైన సంఖ్యలో అగ్నికుల క్షత్రియులు వున్నారు. వారి సౌకర్యంకోసమై హారిపురంలో చేపలు నిల్వచేయు యంత్రాన్ని, రవాణాకు వ్యాన్ సౌకర్యం కల్పించాలి. అలాగే నిజాంపట్నప ఓడరేవును అభివృద్ధి చేయాలి.

పైవిషయాలపై కృషి చేయడానికి ప్రభుత్వంవద్దకు రాయబారాలు సాగించడానికి శ్రీ మండలి సుబ్రహ్మణ్యంగారు కన్వీనరుగా తాలూకాలోగల యిద్దరు శాసనసభ్యులతో సహా వివిధ రాజకీయ పక్షాలకు చెందిన 25 మందిని తాలూకా డెవలప్‌మెంటు కమిటీ ఎన్నుకోబడింది.

కడప - కర్నూలుకాలువ ప్రాంతంలో దొర్వుబావులు

ఎలక్ట్రిక్ మోటార్లకు అధికార్లు పెట్టే అభ్యంతరాలు అరికట్టాలని అభ్యర్థన

కడప, మార్చి 27

కడప తాలూకా రైతుసంఘ అధ్యక్షులు శ్రీ జి. పెద్దిరెడ్డిగారు యిలా వ్రాస్తున్నారు.

కర్నూలు, కడప, కెనాలు ప్రాంతం పోరంబోకులలో చాలాచోట్ల రైతులు దొర్వుబావులు త్రవ్వుకొని, ఆ బావుల క్రింద నీరు పారుదలవైర్లు పెట్టుకొని అనేక సంవత్సరములుగా అనుభవించుచున్నారు. ప్రస్తుతం కడపచుట్టు ప్రక్కల గ్రామాలకు ఎలెక్ట్రిక్ కరెంటు సప్లయి చేయబడింది. కొన్నిచోట్ల పైకనుపరచిన దొర్వుబావులకు కూడా ఎలక్ట్రిసిటీ సప్లయి చేసియున్నారు.

ప్రస్తుతం ఆ బావులను ఎలెక్ట్రిక్ మోటార్లుపెట్టుకొనుటకు పి.డబ్ల్యు.డి డిపార్టుమెంటువారు, (సబ్ డివిజనల్ ఆఫీసరు) కడప డిప్యూటీ తహశీల్దారువారు ఆక్షేపణ చేయుచున్నారు. ఎలెక్ట్రిసిటీవారు కనీస చార్జి కట్టవలెనని నోటీసులు ఇచ్చియున్నారు. ప్రభుత్వంవారుకూడా ఆ యకట్టు ఎక్కువ చేయుటకుగాను ప్రత్యేక సిబ్బందిని నియమించి సర్వేచేయించుచున్నారు.

కాని ఆచరణలో ఇంతకు ముందు నీరు పారించుకొనుటకు హక్కుకల్గిన వాటికికూడ ఆయిల్ ఇంజన్లు, ఎలెక్ట్రి మోటార్లు పెట్టుకొనుటకు అనుమతించుటలేదు. అందువల్ల రైతులు ఎక్కువగా నీరుపారుదల వైర్లు పెట్టుకొనుటకు వీలులేకపోవుచున్నది. గాన ప్రభుత్వంవారు యీ విషయాన్ని గురించి పరిశీలించి మామూలుగా నీరు పారించుకొనే హక్కు కలిగిన భూములకు ఆయిల్ యింజన్లు, ఎలెక్ట్రికల్ మోటార్లు పెట్టుకొనుటకు ఎలాంటి ఆక్షేపణలు లేకుండా చట్టము సవరించి రైతులకున్న ఇబ్బందులు తొలగించవలెనని కోరుచున్నాను.

గ్రామోద్యోగుల ఇబ్బందులు

నివారించాలని అభ్యర్థన

లంకపల్లి; మార్చి 27

కృష్ణాజిల్లా దివితాలూకా గ్రామోద్యోగుల సంఘ సభ్యులు నిన్న జిల్లా కలెక్టరును కలుసుకొని తమ ఇబ్బందులను నివారించాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు.

స్వల్ప వేతనములతోను, వ్యవధిలేని పనితొందరలతోను ప్రభుత్వము వారు తయారు చేయవలసిదిగా నిర్ణయించిన "సర్‌చార్జి లెక్కలు" తయారు చేయజాలక ఈ నెల 14వ తేదీన నాగాయలంక ఫిర్కా గ్రామోద్యోగు లందరు విడివిడిగా రాజీనామాలు దాఖలుచేసి ప్రభుత్వం వారికి మెమొరాడము దాఖలుచేశారు. బందరు రెవెన్యూ-డివిజనల్ ఆఫీసరు గారు గ్రామోద్యోగుల కష్ట నిష్ఠురములు ప్రభుత్వమున కెఱుకపఱచి తగు వుత్తర్వులు తెప్పించెదమని వాగ్దానము చేసిన మీదట, అట్టి ఉత్తర్వులు వచ్చేపర్యంతము తమ రాజీనామాలు ప్రభుత్వం ఆమోదింపక అట్టిపెట్టుటకు, అంతవరకు గ్రామోద్యోగులు తమ సామాన్య విధులు నెఱవేర్చుటకు అంగీకరించారు.

ఈనెల 23న దివితాలూకా గ్రామోద్యోకీయ సంఘం చల్లపల్లిలో సమావేశమై నాగాయలంక ఫిర్కా గ్రామోద్యోగులనుసరించిన విధానము సానుభూతితో సమర్థిస్తూ తీర్మానించింది. ఆ సమావేశములో నిర్ణయించుకున్న ప్రకారము చాలమంది గ్రామోద్యోగులు నిన్న కృష్ణాజిల్లా కలెక్టరుగారిని కలుసుకుని, తమ కష్టనిష్ఠురములు వారికి తెలియజేసి మెమొరాండం సమర్పించారు. అందలి విషయములు పరిశీలించి ప్రభుత్వము వారికి వెంటనే తెలియజేసి తగుసహాయము కలుగజేసెదమని కలెక్టరు రాయబారులకు తెలియజేశారు.

ఆచంట

పశ్చిమ గోదావరిజిల్లా ఆచంటలో యీ నెల 22వ తేదీన రూరల్ బ్యాంక్ ప్రారంభోత్సవం భీమవరం సర్కిల్ కో ఆపరేటివ్ సొసైటీల డిప్యూటీ రిజిస్ట్రారు శ్రీ అసదుల్లాఖాన్ గారు జరిపారు. ఈ సందర్భంలో యేర్పాటు చేయబడిన బహిరంగ సభకు శాసన సభ్యులు శ్రీ దివ్వాది లక్ష్మయ్యనాయుడు గారు అధ్యక్షత వహించారు. రూరల్ బ్యాంకులు గ్రామీణులకు యెలా ఉపయోగపడతాయో వివరిస్తూ పలువురు ప్రసంగించారు.

* * *

కేరళ బడ్జెట్‌పై పార్లమెంటులో చర్చకు అవకాశం యిస్తామని ప్రధాని నెహ్రూ హామీయిచ్చారు.

తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ ద్వితీయ మహాసభ

కరీంనగరులో ఏప్రిల్ 3వ తేది నుంచి 10వ తేది వరకు

కరీంనగరు, మార్చి 27

తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ ద్వితీయ మహాసభను విజయవంతము చేసేందుకు ఏర్పడిన ఆహ్వాన సంఘంవారు వలసినఏర్పాట్లన్నీ ఇంచుమించు పూర్తిచేశారు. 300 మంది ప్రతినిధులకు సౌహార్ద ప్రతినిధులకు వసతి, భోజన సదుపాయాల ఏర్పాట్లు పూర్తిచేశారు.

మహాసభ ఏప్రిల్ 3వ తేదీన ప్రారంభమై 10వ తేదీ వరకు జరుగుతుంది. మహాసభసందర్భంలో రెండు బహిరంగసభలు ఏర్పాటు చేశారు. మొదటిది ఏప్రిల్ 8వ తేదీన రెండవది 10వ తేదీన జరుగుతాయి. ప్రతి సభానంతరం చిత్ర విచిత్ర వేషాలు, బుర్రకథలు, తదితర వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

8వ తేదీ సభానంతరం ఖమ్మం పట్టణానికి చెందిన ఆరు సంవత్సరాల బాలిక 'బేబిదుర్గ' దశావతారనృత్యంపై నృత్య ప్రదర్శనాల నిస్తుంది. నల్లగొండ రాఘవరెడ్డి దళంవారు చిత్ర విచిత్ర వేషాలు ప్రదర్శిస్తారు. ఖమ్మం పట్టణ వైజ్ఞానిక దళంవారు 'పల్నాటి యుద్ధం' బుర్రకథ చెప్తారు.

ఈ రెండు సభలకు పూర్వం సాయంత్రం పూట, ఊరేగింపులు కూడా ఏర్పాట్లు చేశారు.

మొదటి రోజున జరిగే ఊరేగింపు కరీంనగరు కమ్యూనిస్టుపార్టీ కార్యాలయం నుండి బయలుదేరి ప్రధాన వీధులను చుట్టబెట్టి తీరందాజ్ టాకీసు వద్ద ఏర్పాటుచేయబడిన బహిరంగ సభ ప్రదేశానికి చేరుకుంటుంది. 10వ తేదీన జరిగే ఊరేగింపు కమాన్ వద్దనుండి బయలుదేరి సభాస్థలికి చేరుకుంటుంది.

ఉపన్యాసాలు

8వ తేదీన జరిగే బహిరంగసభలో పొలిట్ బ్యూరో సభ్యులు, ఆంధ్ర శాసనసభ ప్రతిపక్షనాయకులు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య, కేంద్ర కమిటీ సభ్యుడు, పార్లమెంటు సభ్యులైన శ్రీ రావినారాయణరెడ్డి, హైద్రాబాద్ శాసనసభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ వి. డి. దేశపాండే గారల ప్రసంగాలుంటాయి.

ఈ సభలో అఖిల హైద్రాబాదు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి రాజ్యసభ సభ్యులు అయిన శ్రీ రాజబహద్దూర్ గౌడు గారు అధ్యక్షత వహిస్తారు.

10వ తేదీన జరిగే బహిరంగ సభకు భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ అజయకుమార్ ఘోష్, పొలిట్ బ్యూరో సభ్యులూ, ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి అయిన శ్రీ చండ్ర రాజేశ్వరరావు, అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు సహాయ కార్యదర్శి; శాసనసభ్యులు అయిన శ్రీ మఖ్దూం మొహియుద్దీన్ గారలు ప్రసంగిస్తారు. సభకు తెలంగాణా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీబద్దం ఎల్లారెడ్డిగారు అధ్యక్షత వహిస్తారు.

స్టాక్‌హోమ్ శాంతి మహాసభ

డాక్టర్ రాజశేఖరరావుగారికి ఏలూరులో వీడ్కోలు

ఏలూరు, మార్చి 27

ఏలూరు మునిసిపల్ కౌన్సిలు మాజీ ఉపాధ్యక్షులు, ప్రముఖ జాతీయవాదులైన డాక్టరు దుగ్గిరాల రాజశేఖరరావు గారు అఖిలభారత శాంతి సంఘం తరఫున ఆంధ్ర ప్రతినిధిగా స్టాక్‌హోమ్‌లో జరుగనున్న శాంతి సంఘ సమావేశంలో పాల్గొనటానికి వెళ్ళే సందర్భంలో కౌన్సిలుహాలులో వీడ్కోలు సభ జరిగింది. సభకు మునిసిపల్ ఛైర్మను శ్రీ దామరాజు వెంకట్రావుగారు అధ్యక్షత వహించారు.

జన్నలిస్టు శ్రీ కోటయ్యనాయుడు, కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ ఎ. సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు తాతా అప్పలస్వామి, మీరా సాహేబ్, యస్. రామమోహనరావు గార్లు యీ సందర్భంలో మాట్లాడుతూ విశ్వశాంతికై భారతదేశమూ, ఆంధ్ర రాష్ట్రం చేసిన కృషిని విదేశాలలో వివరించాలని, భారతీయ నాగరికతను, సంస్కృతిని అన్య దేశాలవారికి స్పష్టం చేయవలసిందిగాను శ్రీ రాజశేఖరరావుగారిని కోరారు. విదేశాలలో తమ స్వీయ అనుభవాలను ప్రజా జీవితాన్ని యాత్రానంతరం ఆంధ్రులకు తెలియజేయుమని, యాత్ర జయప్రదం కావాలనికూడా ఉపన్యాసకులాకాంక్ష వెలిబుచ్చారు.

అల్పాహారానంతరం, అధ్యక్షుల ఆఖరి మాటలతో సమావేశంముగిసింది.

మధ్యప్రదేశ్‌లో జౌళి కార్మిక సమ్మె

నాగపూర్, మార్చి 27

యంత్రపరికరాలను మార్చాలనే సాకుతో 'ఎంప్రెస్‌మిల్స్'లో ఒక యూనిట్‌ను మూసివేసినందుకు ఆక్షేపణ తెలియజేస్తూ పద్నాలుగు వేలమంది జౌళికార్మికులు జనవరి 27వ తేదీనుండి సమ్మె చేస్తున్నారు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ సందర్భంలో ఒక ప్రకటనచేస్తూ, కార్మికులు పనిలోకి వెళ్ళాలని కోరింది. అలా వెళ్ళకపోతే అనవసరమైన నష్టాలకు గురి అవుతారని హెచ్చరించింది. పునర్నిర్మాణ పథకంతో సంబంధం లేని కోర్కెలను కార్మికులు ప్రతిరోజూ తెస్తున్నారని ఆరోపించింది.

హుస్సేన్‌వాలా వద్ద తిరిగి పాక్ సైనిక సన్నాహాలు

అమృతసర్, మార్చి 27

ఫిరోజ్‌పూర్ జిల్లా హుస్సేన్‌వాలా ప్రాంతంలో సరిహద్దు వద్ద పాకిస్తాన్‌వారు సైనిక సన్నాహాలు సాగిస్తున్నారని నమ్మకంగా తెలుస్తూంది. పాకిస్తాన్ అధికారులు సరిహద్దు ప్రాంతంలోకి అదనపు పటాలాలను కూడా దింపారనీ, దీని ఫలితంగా అక్కడ ఉద్రిక్తత పెరిగిందనీ తెలుస్తూంది.

ఈ సైనిక సహాయాల మూలంగా, భారత ప్రాంతంలోని హుస్సేన్‌వాలా హెడ్‌వర్క్సు మరామత్తులు ఆగిపోయాయట కూడా.

ఈ నెల 18వ తేదీ రాత్రి పాక్, భారత సరిహద్దు సైనిక దళాల మధ్య సుమారు 14 గంటలసేపు కాల్పులు జరిగింది ఈ హుస్సేన్‌వాలా వద్దనే.

నాగాకొండ ప్రాంతాల్లో అల్లరి

భారతీయ సైనికదళాల పయనం

షిల్లాంగ్, మార్చి 27

అస్సాం రాష్ట్రానికి చెందిన నాగాకొండ ప్రాంతాలలో స్వతంత్ర రాష్ట్రం కోరుతున్న నాగజాతివారు తిరిగి దౌర్జన్యాలు ప్రారంభించారు. వీరు అజ్ఞాతవాసంలో వుండి ప్రభుత్వ కార్యాలయాలపై అకస్మాత్తుగా దాడి చేస్తున్నారు. వీరి అల్లరిని అదుపులోకి తేవడానికై భారతీయ సైనికదళాలు నాగాకొండ ప్రాంతాలకు బయలుదేరి వెళ్ళాయి.

నాగజాతీయ కౌన్సిల్‌కు చెందిన ఫీజో-మున్నగు ప్రముఖనాయకులు స్వతంత్ర నాగరాష్ట్రం కోసం దౌర్జన్యాన్ని ప్రోత్సహించారు. ఫీజో, అతని అనుయాయులందరూ ఇప్పుడు అజ్ఞాతవాసంలో ఉన్నారు.

మలబారులో రబ్బరు ఎస్టేట్లు మూసివేత

మద్రాసు, మార్చి 28

మలబారుకు చెందిన వళ్ళువనాడు, ఎర్నాడు తాలూకాలలో సుమారు 30 రబ్బరు ఎస్టేట్లు సాంకేతిక కారణాలవల్ల మూసివేయబడ్డాయి. తగినంత ప్రతిఫలంచేతికి రాలేదనే సాకుతో ఫిబ్రవరి నెలలో ఇంకొక ఎస్టేటు మూసివేయబడింది.

మద్రాసు శాసనసభలో శ్రీ కె. పి. గోపాలన్ ప్రతిపాదించిన అత్యవసర తీర్మానంపై మాట్లాడుతూ మంత్రి శ్రీ భక్తవత్సలం ఈ విషయాలను వెల్లడించారు.


ఇండియాలో మొదటిది ఇప్పటికి గూడా ప్రశస్తమైనది
మిక్కిలి నమ్మకమైనది.
ఎక్కువ దాగి చాలా కాలము పనిచేయును.
పరిశ్రమలో వాడుటకు పాడుపైనది.
Prabhat
ప్రభాత్
ప్రభాత్ ప్రొడక్ట్స్ కంపెని
పోస్టు బాక్సు నెం. 801, బొంబాయి 1.

బెంగాల్ బీహార్ విలీనానికి నిరసన

ఇంతవరకు 3400 మంది అరెస్టు

కలకత్తా, మార్చి 27

బెంగాల్ బీహార్ విలీనానికి వ్యతిరేకంగా ఆందోళన సాగిస్తున్న 44 మంది వలంటీర్లను ఇవాళ అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు స్త్రీలు. ఇద్దరు కలకత్తాలో వుంటున్న బీహారీలు.

భాషారాష్ట్ర పునర్నిర్మాణ సమితి వారు బెంగాల్ బీహార్ విలీనానికి నిరసనగా సత్యాగ్రహోద్యమం ప్రారంభించి ఇప్పటికి 27 రోజులైంది. ఇంతవరకు ఈ సందర్భంలో కలకత్తాలోను, జిల్లాలలోను 3400 మందిని అరెస్టుచేశారు.

తిరుకొచ్చిలో "నిరసన దినం"

రాష్ట్రపతిపాలనకు నిరసనగా

త్రివేండ్రం, మార్చి 28

తిరువాన్కూర్-కొచ్చిన్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినందుకు ఏప్రిల్ 3వ తేదీన "నిరసన దినం" జరపాలని వామపక్ష పార్టీలు నేడు పిలుపిచ్చాయి.

ఆరోజున నిరసన సభలు, ప్రదర్శనలు జరపవలసిందిగా కమ్యూనిస్టు, ప్రజాసోషలిస్టు, రివల్యూషనరీ సోషలిస్టుపార్టీలు ఒక సంయుక్త ప్రకటన చేశాయి.

పలుకుబడి కోల్పోయినకాంగ్రెస్ పార్టీ పన్నిన కుట్ర ఫలితంగానే రాష్ట్రపతిపాలన ఏర్పడిందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

◆

పంజాబుపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మహా పంజాబు సమితికి చెందిన బలరామ్ టాండన్ నిరశన వ్రతం పూనుతున్నారు.

◆ ◆ ◆

61వ జన్మదినోత్సవ సందర్భంలో మొరార్జీ దేశాయికి ఇహమ్మదాబాద్ మిల్లు యజమానులు 61 వేల రూపాయల నిధిని సమర్పించారు.

ఈజిప్టులో అణుయంత్రాగారాల స్థాపనకు రష్యా సాయం

కెయిరో, మార్చి [illegible]

ఈజిప్టుకి సోవియట్ యురేనియం ఇస్తానన్నదని, పత్తిని ఇతర సరకులను తీసుకొని వాటికి మారుగా ఈజిప్టులో అణుశక్తి యంత్రాగారాలను నిర్మించడానికి సంసిద్ధత వెలిబుచ్చిందని నేడు కెయిరో పత్రికలు పతాక శీర్షికలతో ప్రకటించాయి.

రష్యా ఈవారికే ఈజిప్టుకి ఒక అణుశక్తి లేబరేటరీని ఇచ్చిందని, ఇపుడు అన్నిరంగాలలో సాంకేతిక సహాయం చెయ్యడానికి సిద్ధంగా వుందని ప్రభుత్వ సన్నిహిత పత్రిక "అల్ గమ్‌హూరియా" ప్రకటించింది.

గత మాసంలో ఒక ఈజిప్టు ప్రతినిధి వర్గం మాస్కో సందర్శించింది. అపుడు కెయిరోలో ఒకఅణుశక్తి లేబరేటరీ స్థాపనకు తోడ్పడగలమని, దాని నిర్మాణంలో సలహాలివ్వడానికి నిపుణులను పంపగలమని, మాస్కోలో ఈజిప్టు నిపుణులకుశిక్షణఇవ్వగలమని, భూగర్భ పరిశోధన పరికరాలను అందజేయగలమని సోవియట్ వాగ్దానం చేసింది.

సోవియట్ తరఫున అపుడు ఒడంబడికపై సంతకం చేసిన ఇంజనీరింగ్ నిపుణుడు నికోలాయ్ మెల్నికోవ్ ఇపుడు ఈజిప్టులో వున్నారు.

ఈజిప్టుకు రష్యా యురేనియం ఇవ్వగలదని, ఈజిప్ట్ ఎడారులలో యురేనియం కొరకు పరిశోధన జరిపించగలదని ఆయన నేడు తెలియజేశారు.

* * *

మద్రాసు శాసనసభా ప్రజాసోషలిస్టు పార్టీలోని ఇద్దరు సభ్యులను పార్టీనుండి తొలగించేందుకు ఆ పార్టీ నిశ్చయించింది.

◆ ◆ ◆

తిరుకొచ్చి రాజప్రముఖుని సలహాదారుడైన శ్రీ పి. యస్. రావు బుధవారంనాడు కలకత్తాకు స్వంత పనిమీద వెళ్ళారు.

రేడియో

మార్చి 31 శని॥

విజయవాడ: (357.1 మీటర్లలో) ఉదయం:

6-50 స్వాగతము;
6-55 ప్రసారవిశేషాలు;
7-0 (తె. వా.);
7-15 ఉదయగానం;
7-30 మద్రాసునివలె;
8-0 (ఆం. వా.);
1-0 మద్రాసువలె;
1-30 గీతావళి;
1-40 హిందీలో వార్తలు
1-50 (తె. వా.);
4-0 వనితావాణి;
5-30 సంకీర్తనం;
6-0 ఉభయకుశలోపరి;
6-15 (ప్రాం. వా.);
6-25 స్థానిక ప్రకటనలు;
6-30 గ్రామస్థులకు;
7-0 (తె. వా.);
7-15 బంగారుపంట - నాటిక;
7-30 కావ్యలతి;
8-0 సంకీర్తనం;
8-30 రేడియో న్యూస్‌రీల్;
8-40 కృతులు;
9-0 (ఆం. వా.);
9-30 సంగీత కార్యక్రమం;
11.0 సమాప్తి

మద్రాసు బి. (211.3 మీటర్లలో) ఉదయం:

6-50 స్వాగతము;
7-0 (తె. వా.);
7-15 ఉదయగానం;
7-30 బాలానందం;
8-0 (ఆం. వా.);
1-0 గీతమాలిక;
1-30 (ఆం. వా.);
1-40 గీతమంజరి;
1-50 (తె. వా.);
2-0 వీణ;
5-30 వయొలిన్;
6-0 (ఆం. వా.);
6-15 (ప్రాం. వా.);
6-25 లలితగీతము;
6-30 గ్రామస్థులకు;
7-0 (తె. వా.);
7-15 బంగారుపంట, నాటిక;
7-30 సంగీతోత్సవం;
8-30 రేడియో న్యూస్‌రీల్;
9-0 (ఆం. వా.);
9-30 సంగీత కా. క్ర.;
11-0 సమాప్తి.

హైద్రాబాద్: (411.0 మీటర్లలో) ఉదయం:

6-50 సుప్రభాత్;
6-55 కార్యక్రమనివరణ
7-0 (తె. వా.);
7-15 ఉదయగానం;
7-45 (క. వా.);
8-0 (ఆం. వా.);
8-15 (హిం. వా.);
8-30 కీర్తన్;
8-45 ఫిల్మ్, గీత్;
12-50 (ఉ. వా.);
1-0 వీణ, గాత్రం;
1-30 వేణువు;
1-50 (తె. వా.);
5-30 గీతావళి;
5-45 వయొలిన్;
6-0 (క. వా.);
6-30 భావగీతంగ్;
6-40 స్థానిక ప్రకటనలు;
6-45 గీతావళి;
7-0 (తె. వా.);
7-15 గ్రామసీమ
7-45 కీర్తన;
8-0 పుస్తక సమీక్ష;
8-15 ఘజల్ గీత్;
8-30 భజన్, ఘజల్;
9-0 (ఆం. వా.);
9-15 (ఉ. వా.);
11.0 సమాప్తి.

బ్రిటిష్ కామన్‌వెల్తు నుండి భారత దేశం వైదొలగవలసిన ఆవశ్యకత

★★★

విదేశాంగవిధానంపై లోక్‌సభలో ప్రసంగిస్తూ ఒక్కుమ్మడిగా ప్రతిపక్ష నాయకుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 28

కాశ్మీర్, గోవా తదితర సమస్యలపై బ్రిటన్ తదితర కామన్‌వెల్తురాజ్యాలు భారత వ్యతిరేకవిధానాలను అనుసరించుతున్నదృష్ట్యా కామన్‌వెల్తు సభ్యత్వాన్ని భారత దేశం విడనాడాలని నేడు విదేశాంగ వ్యవహారాలపై ప్రసంగిస్తూ ప్రతిపక్షంలోని ముఖ్యనాయకులంతా కోరారు.

కామన్‌వెల్తు ప్రధానుల సమావేశాలకు భారత ప్రధానమంత్రి హాజరు కాకుండా వుండటం మంచిదని కమ్యూనిస్టుపార్టీ ఉపనాయకుడు ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ సూచించారు.

దాదాపు 17 కోట్ల రూపాయల ఖర్చుగల విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ పద్దుపై నేడు లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది.

నేడు లోక్‌సభలో సోవియట్ ఉపప్రధాని మికోయాన్, ఉజబెకిస్తాన్ సుప్రీమ్ సోవియట్ అధ్యక్షుడు యస్. ఆర్. రాషిదావ్‌లు రాష్ట్రపతి కూర్చునే స్థానంలో కూర్చుని ఒక అరగంటపాటు సభా వ్యవహారాలను పరిశీలించారు.

విదేశాంగ వ్యవహారాల పద్దుపై ప్రజా సోషలిస్టు నాయకుడు ఆచార్య కృపలానీ చర్చను ప్రారంభిస్తూ, తాను భారతదేశ విదేశాంగ విధానంలోని మూల సూత్రాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నానని చెప్పారు. అయితే విధానంలోని వ్యూహం, ఎత్తుగడలు సరిగాలేవన్నారు. అందువలన మనం ఒక కూటమివైపుకు మొగ్గుతున్నామనే అభిప్రాయం కొందరికి కలుగుతున్నదన్నారు.

"ఉదాహరణకు గత నవంబరులో సోవియట్ నాయకులకు రాజలాంఛనాలతో బ్రహ్మాండమైన స్వాగతం యిచ్చాం. తత్ఫలితంగా వారుఅందరిచేత గుర్తించబడిన కొన్ని సాంప్రదాయాలకు విడనాడి మన భూమిమీదనుండే, మనకి స్నేహంగా వుండే కొన్ని దేశాలను విమర్శించారు. వారలా మాట్లాడిన ఫలితంగానే డల్లెస్ గోవా సమస్యపై ఆ రకమైన వైఖరిని తీసుకొన్నాడని నేను అభిప్రాయ పడుతున్నాను."

డాక్టర్ సత్యనారాయణసిన్హా (కాంగ్రెసు - బీహార్): గోవా, కాశ్మీర్‌లపై బుల్గానిన్, కృశ్చేవ్‌లు వెలిబుచ్చిన అభిప్రాయాలకు ఏ ఒక్క భారతీయునికీ అభ్యంతరంవుండరాదు. వారు మన ప్రభుత్వం తీసుకొన్న వైఖరినే బలపరిచారు.

ఆచార్య కృపలానీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఇండియా తనకు లభించిన అవకాశాలను సరిగావినియోగించుకోలేదన్నారు. హైద్రాబాద్‌లో పోలీసుచర్య జరిగినకాలంలో గోవాద్వారా హైద్రాబాద్‌కు ఆయుధాలు చేరవేయబడినవన్నారు. అప్పుడే గోవాను కూడా స్వాధీనం చేసుకొని వుండవలసిందన్నారు.

బ్రిటిష్ కామన్వెల్తుతో మనదేశానికిగల సంబంధాన్ని గురించి ఆచార్య కృపలానీ ప్రస్తావించి, బ్రిటన్ తదితర కామన్‌వెల్తు రాజ్యాలు మనదేశ ప్రయోజనాలను ఏమాత్రం లెక్కచెయ్యకుండా మన వ్యతిరేకులకు మద్దతునిచ్చే ప్రస్తుత విధానాన్నే కొనసాగిస్తే మనం ఇంక కామన్‌వెల్తులో వుండరాదని స్పష్టంచేశారు. ఇండియాకు వ్యతిరేకంగా బ్రిటన్, పోర్చుగల్, పాకిస్తాన్‌లను అదేపనిగా బలపరుస్తున్నదని ఆయనన్నారు.

భారతదేశ ప్రతిష్ఠ

శ్రీ జోకిమ్ ఆల్వా (కాంగ్రెస్-బొంబాయి) మాట్లాడుతూ, 29 ఆసియా, ఆఫ్రికా దేశాలను ఒక చోటికి చేర్చిన బాండుంగ్ మహాసభను, మన ప్రధాని సోవియట్ సందర్శన, సోవియట్ నాయకుల భారతదేశ సందర్శన మొదలుగాగల ఘటనలు భారతదేశ అంతర్జాతీయ కీర్తిని ఇనుమడింపచేశాయన్నారు.

శ్రీటి. గోవిందదాస్ (కాంగ్రెసు-మధ్యప్రదేశ్) ప్రపంచంలో భారతదేశానికి సముచిత స్థానాన్ని సంపాదించిపెట్టిన నెహ్రూ విదేశాంగ విధానాన్ని కొనియాడారు. భారత విదేశాంగ విధానం దాని ప్రాచీన సాంప్రదాయాలకూ, సంస్కృతికీ అనుగుణ్యంగా వున్నదన్నారు.

ప్రొఫెసర్ హీరేన్ ప్రసంగం

కమ్యూనిస్టుపార్టీ ఉపనాయకుడు ప్రొఫెసర్ హీరేన్‌ముఖర్జీ ప్రసంగిస్తూ ప్రధానమంత్రి అనుసరిస్తున్న విదేశాంగ విధానంలోని పొగడదగిన అంశాలను తనపార్టీ పొగడుతూనే వున్నదంటూ ఇలా అన్నారు:

"అయితే ప్రభుత్వ విధానాలు మన ప్రజలు నిజంగా వాంఛించుతున్న పద్ధతిలో ఇంకా మార్పుచెందవలసివుంది. ప్రధానమంత్రి ఎవరెవరితో స్నేహంచేసినా అభ్యంతరం చెప్పే అవసరం నాకులేదు. కాని ఒక విషయంమాత్రం ఆయనతో నేను చెప్పవలసివుంది. బ్రిటిష్ కామన్‌వెల్తు ప్రధానమంత్రుల సమావేశాలకు ఇంకా ఆయన హాజరుకావడం ఏమంత మర్యాదతో కూడుకొన్న పనికాదు."

భారత - పాకిస్తాన్ సంబంధాలను గురించి ప్రొఫెసర్ ముఖర్జీ ప్రస్తావించి, ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల కుతంత్రాలవల్లనే ఉభయదేశాల సంబంధాలు చెడిపోతున్నాయన్నారు. కాశ్మీర్ ప్రజలు తమ భవితవ్యాన్ని నిర్ణయించుకొన్నారు. కాబట్టి ఐ. రా. స. నుండి కాశ్మీర్ సమస్యను భారతదేశం ఉపసంహరించుకోవాలని కోరారు.

తూర్పు బెంగాల్‌నుండి హిందువులు అదేపనిగా వలస రావడాన్ని ఆపివేయాలన్నారు. గోవా సమస్యపై ప్రభుత్వం ఖచ్చితమైనవైఖరిని తీసుకోవాలన్నారు.

డాక్టర్ సత్యనారాయణసిన్హా మాట్లాడుతూ, నెహ్రూ విదేశాంగ విధానంమూలంగా అనేక సత్ఫలితాలు కలిగాయన్నారు. అమెరికా, బ్రిటన్‌లు ప్రోత్సహిస్తున్న సైనిక ఒడంబడికలను ఆయన నిశితంగా ఖండించారు. ఆగ్నేయాసియాకూటమికివ్యతిరేకంగా పాకిస్తాన్‌లోనే చాలా వ్యతిరేకత కలదన్నారు. కాశ్మీర్ కాలవల తగాదాలవలనగాక పశ్చిమరాజ్యాలు ప్రోత్సహిస్తున్న ఈ మిలిటరీ ఒడంబడికల మూలంగానే భారతపాకిస్తాన్ రాజ్యాలు రోజు రోజుకు వేరుపడిపోతున్నాయన్నారు.

సోవియట్ యూనియన్ నిజంగా ప్రపంచశాంతిలో కృషి చేస్తున్నదనీ, దానితో మనకుగల స్నేహ సంబంధాలను మరింత దృఢపరచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లంక సుందరం హెచ్చరిక

డాక్టర్ లంక సుందరం (స్వతంత్ర - ఆంధ్ర) మాట్లాడుతూ, కామన్‌వెల్తుతో ఇండియా ఇంకా సంబంధాలను వుంచుకోడాన్ని విమర్శించారు. ఆగ్నేయాసియా కూటమి సమావేశంలో కాశ్మీర్ సమస్యను తీసుకొని రావడమేగాక దానిపై ఒక ప్రకటన చేయించడానికి కూడా పాకిస్తాన్‌కు అవకాశంవుండగా కామన్వెల్తు ప్రధానుల సమావేశంలో ఎజెండాను సూచించే హక్కుకూడా భారతదేశానికి లేదన్నారు.

గోవా సమస్యలోకూడ భారతదేశం తన విధానాన్ని మార్చుకోవాలని ఆయన కోరారు.

శ్రీ బి. కె. దాస్ (కాంగ్రెసు-బెంగాల్) పాకిస్తాన్‌లో, మైనారిటీలలో విశ్వాసాన్ని కలిగించేందుకు భారత ప్రభుత్వం తగిన చర్యలను తీసుకోవాలన్నారు.

శ్రీ అమరసింగ్ సైగల్ (కాంగ్రెస్-మధ్యప్రదేశ్) భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసించారు. పంచశీలను అనుసరించే దేశాలు ఎక్కువవుతున్నందుకు సంతోషంగా వున్నదన్నారు.

తూర్పుబెంగాల్‌నుండి వలస

శ్రీమతి సుచేత కృపలానీ మాట్లాడుతూ, తన ప్రసంగాన్ని పూర్తిగా తూర్పు బెంగాల్‌నుండి వస్తున్న కాందిశీకుల సమస్యకు పరిమితం చేశారు.

ఈ సమస్యను కేవలం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి వదలివేయడం మంచిది కాదన్నారు. దీనిని జాతీయ సమస్యగా తీసుకొని పరిష్కరించడానికి పూనుకోవాలన్నారు.

డాక్టర్ సురేశచంద్ర (కాంగ్రెసు-హైద్రాబాద్) విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ విదేశాల్లో భారత దేశ సంస్కృతిని గురించి ప్రచారం చేయాలని సూచించారు.

మైనారిటీ వ్యవహారాలమంత్రి శ్రీ సి. సి. బిశ్వాస్ ప్రసంగిస్తూ, తూర్పు బెంగాల్‌నుండి వస్తున్న వలసలు చాల ఆందోళన కలిగిస్తున్నదన్నారు. అయితే దీనిని పరిష్కరించగలగడం భారత ప్రభుత్వం చేతుల్లోలేదని తెలిపారు. మనం చేయగలిగినదంతా చేశామన్నారు.

హిందువులపై అత్యాచారాలు ఇటీవల హెచ్చుకావడంవల్లనే ఈ వలస ప్రారంభమైనదని ఆయన తెలిపారు. పాకిస్తాన్ ముస్లింలకోసమే ఏర్పడిందనే ప్రచారంకూడా హిందువులను భయపెట్టుతున్నదన్నారు.

జనవరి, ఫిబ్రవరి మాసాల్లోనే 70 వేల మంది హిందువులు భారత దేశానికి తరలి వచ్చారన్నారని ఆయన వివరించారు.

శ్రీ యన్. వి. గాడ్గిల్ (కాంగ్రెసు - బొంబాయి) మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న పద్ధతిలోనే తూర్పు బెంగాల్ నుండి ఈ వలస కొనసాగితే అయిదు సంవత్సరాలల్లో తూర్పుబెంగాల్‌లోని హిందువులంతా ఇండియాలో వుండిపోగలరన్నారు.

గాడ్గిల్ ప్రసంగం ముగియకముందే సభ నేటికి వాయిదా పడింది.

ప్లానింగ్ కమిషన్‌తో మికోయాన్ గోష్ఠి

న్యూఢిల్లీ, మార్చి 28

సోవియట్ ఉపప్రధాని మికోయాన్ నేడిక్కడ భారత ప్లానింగ్ కమిషన్ సభ్యులను కలుసుకొని గంటసేపు చర్చలు జరిపారు. మికోయాన్ వెంట సోవియట్ రాయబారి మెన్షికోవ్ కూడా వెళ్ళారు. ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు శ్రీ వి. టి. కృష్ణమాచారి వారికి స్వాగతమిచ్చారు.

తమ దేశంలో దీర్ఘకాల ప్లానింగ్, సాంవత్సరిక ప్లానింగ్ ఎలా జరిగేదీ మికోయాన్ వివరించారు. ప్రణాళికీ వనరులు, సంపద పంపకం, వ్యావసాయిక పారిశ్రామిక ఉత్పత్తి పెంపుదల మున్నగు విషయాలపై వీరు చర్చలు జరిపారు.

ఆ తర్వాత ఆర్థికమంత్రి శ్రీ దేశముఖ్‌ని, హోంమంత్రి పండిత్ పంత్‌ని వేర్వేరుగా మికోయాన్ కలుసుకున్నారు. రష్యా, ఇండియాల మధ్యవర్తకాభివృద్ధిని గురించి వీరు సంభాషించినట్లు తెలుస్తున్నది.

కార్యక్రమంలో ముందుగా నిర్ణయించకపోయినప్పటికీ నేటి మధ్యాహ్నం మళ్ళీ మికోయాన్ ప్రధాని నెహ్రూతో గంటసేపు సంభాషణలు జరిపారు.

నేటి ఉదయం మికోయాన్ రాజఘాట్ సందర్శించి మహాత్మాగాంధీ సమాధికి పుష్పాంజలి ఘటించారు.

రేపుఉదయం మికోయాన్‌బృందం వీరుఆగ్రాలో గంటసేపు ఆగి తాజ్ మహల్ సందర్శిస్తారు.

విశాఖ నూనె శుద్ధి కార్మికుల సమ్మె

గుమాస్తాల సానుభూతి

విశాఖపట్నం, మార్చి 28

మొన్న ప్రారంభమైన నూనెశుద్ధి కర్మాగారం కార్మికుల సమ్మె కొనసాగుతూంది. లుమ్సన్ కంపెనీలో పనిచేసే 150 మంది గుమాస్తాలుకూడా నిన్న మధ్యాహ్నంనుంచి సమ్మెలో పాల్గొంటున్నారు. నేటి ఉదయం నుంచి కంపెనీ ఇంజనీర్లుకూడా సమ్మెలో చేరారు. (వి. వి.)

పార్లమెంటు సభ్యులతో మికోయాన్ కాలక్షేపం

హిందీ పాటతో హరీన్ కవి సుస్వాగతం

న్యూఢిల్లీ, మార్చి 28

సోవియట్ ఉపప్రధాని అనస్తాస్ మికోయాన్ నేడు తన గౌరవార్థం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ సత్యనారాయణ సిన్హా యిచ్చిన విందు సందర్భంలో పార్లమెంటు సభ్యులతో సరదాగా కాలం గడిపారు.

అంతకు ముందు ఆయన ఒక అరగంటపాటు లోక్‌సభా చర్చలను పరిశీలించి వచ్చారు. విందులో స్పీకర్ అనంతశయనం అయ్యంగార్‌ను కలుసుకోగానే మికోయాన్‌ను అభినందిస్తూ "ఒక నియంతలాగా సభావ్యవహారాలను మీరు చక్కగా నిర్వహించారు" అని అన్నారు.

అయ్యంగార్: కాదు, కాదు. నేను ప్రజాతంత్రవాదిని.

మికోయాన్: పోనీ అలాగే; మీరు ప్రజాస్వామిక నియంతగా వ్యవహరించారు.

పార్లమెంటుకవి హరీంద్రనాథ్ చట్టోపాధ్యాయ ఒక చక్కని హిందీ పాటపాడుతూ మికోయాన్‌ను ఆహ్వానించారు. ఆ పాట పాడుతున్నంతసేపు శ్రీ నెహ్రూ ఆనందంగా వింటూ అదేపనిగా [illegible] కూర్చున్నారు.

హరీన్‌కవి పాడిన పాటలోని అర్థం సంగ్రహంగా యిది:

భారతీయులు, సోవియట్ ప్రజలూ యిప్పుడు సోదరులైనారు!

ఇక నిష్పృహను, నిరుత్సాహాన్ని పూర్తిగా వదలివేయండి!!

ధర్మచక్రం, అరుణపతాకం - రెండూ కలసి నేడు జంటగా ఎగురుతున్నాయి. ఉభయులు నేడు ఒకే పాటను — శాంతిపాటను పాడుకొంటున్నాం.

నిష్పృహను, నిరుత్సాహాన్ని ఇక విడనాడండి!!!

మన మార్గాలు విభిన్నమైనప్పటికీ, మన జెండాలరంగులు వేర్వేరైనప్పటికీ మనం కలుసుకొన్నప్పుడు మన ఉభయుల జెండాలను కలిపి ఎగురవేద్దాం.

కబుర్లు

పార్లమెంటుభవనంలోగలతోటలో బ్రహ్మాండమైన సెంట్రల్‌హాల్ భవనం ఎదురుగా నెహ్రూ, సిన్హా, జగజీవన్‌రామ్‌లు నిలబడి మికోయాన్‌తో యిలా అన్నారు:

ఈ పెద్దభవనం బ్రిటిష్‌పరిపాలనా కాలంలో నిర్మించబడింది. ఇప్పుడిక క్రమబద్ధమైన ఆర్థిక విధానాన్ని అనుసరిస్తున్నాం గాబట్టి ఈ రకపు పెద్దభవనాలకు ధనాన్ని వెచ్చించడం ఇంక సాధ్యంకాదు.

మికోయాన్: సోవియట్ యూనియన్‌లోకూడా ఇప్పుడు చిన్న భవనాలను-12, 14 అంతస్తుల భవనాలకంటే హెచ్చుకానివి నిర్మించాలనే భావం హెచ్చుగావుంది.

నెహ్రూ: 14 అంతస్తుల భవనాలుఅంటే ఇక్కడ చాల పెద్ద భవనాలుగా ఎంచుతారు. మా శీతోష్ణస్థితినిబట్టి మాకు చిన్న భవనాలే కావాలి. మాకుఎక్కువగాలి కావాలి.

తాను సోవియట్‌యూనియన్‌లో వున్నప్పుడు బ్రహ్మాండమైన లెనిన్ శిలా విగ్రహాన్ని చూశానని శ్రీ నెహ్రూ అనగా మికోయాన్ అందుకొని "నిజమే; ఆ శిలావిగ్రహం ఈ పార్లమెంటు భవనం అంత ఎత్తు వున్నది" అని అనగానే వింటున్న సభ్యులంతా నిర్ఘాంతపోయారు.

శ్రీమతి యిలాపాలచౌదరి (కాంగ్రెసు) శ్రీమతి రేణుచక్రవర్తినితీసుకొనివచ్చి ఈమె "కమ్యూనిస్టు" అనిమికోయాన్‌కు పరిచయం చేసింది. ఈ దృశ్యాన్ని ఫొటో తీయడానికి ఫొటోగ్రాఫర్లు యత్నించుతూ వుండగా శ్రీమతి రేణు హాస్యంగా యిలా అన్నది:

"కమ్యూనిస్టు అయిన మికోయాన్‌తో కరచాలనం చేయడమంటే శ్రీమతి చౌదరి భయపడిపోవచ్చుసుమా!"

శ్రీమతి చౌదరి: నిజమైన కమ్యూనిస్టుతో కరచాలనం చేయడం ఎంతో గౌరవంగా నేను ఎంచుకొంటాను.

ఈ సంభాషణకు మికోయాన్ ఏమీ అనకుండా కేవలం నవ్వి పూరుకొన్నారు.

విందు అనంతరం మికోయాన్, ఆయన బృందం ప్రధాన మంత్రితో ఆయన పార్లమెంటు కార్యాలయంలో కొంతసేపు కాలక్షేపం చేశారు.

సోవియట్ సహాయం

(1వ పేజీ తరువాయి)

కోవాలనే భారతదేశ వాంఛను సోవియట్ గుర్తిస్తున్నది. ఇండియాలో నూనె నిల్వలు కోట్లలుగా వున్నాయి. వాటిని బయటికి తీయవచ్చు. కాని ఇప్పుడు ఈ కీలక పదార్థంకోసం ఇండియా ఇతర దేశాలపై ఆధారపడుతున్నది. భారత ప్రభుత్వం కోరినట్లయితే, మీరు స్వంత నూనె పరిశ్రమలను స్థాపించుకోడంలో మా అనుభవాన్ని పంచియివ్వడానికి సిద్ధంగా వున్నాం. అవసరమైతే, పరికరములను సప్లయి చేయడంలో, సిబ్బందికి శిక్షణ ఇవ్వడంలోకూడా సహకరించడానికి సిద్ధంగా వున్నాం."

అన్ని దేశాలతోను వాటి ఆర్థిక రాజకీయ వ్యవస్థలతో నిమిత్తం లేకుండా వర్తకసంబంధాలు పెంపొందించడానికి కొత్త సోవియట్ పంచవర్ష ప్రణాళికలో అవకాశం కల్పించబడిందదనిమికోయాన్ అన్నారు. 60 దేశాలతో ఇప్పుడు సోవియట్‌కు విస్తృత వర్తక సంబంధాలున్నవన్నారు. వ్యాపారంతోపాటు విస్తృత సాంకేతిక సహకారాన్ని కూడా కొనసాగిస్తున్నామన్నారు.

భారత సోవియట్ సంబంధాలకు ఆధారమైన "పంచశీల" పదం రష్యన్ భాషలోబాగా ప్రచారమైనదన్నారు. ఈసూత్రాలను సోవియట్ మిక్కిలి గౌరవిస్తుంది. వీటిని తు.చ.తప్పకుండా పాటిస్తుంది. విభిన్న ఆర్థిక, సాంఘిక రాజకీయ వ్యవస్థలుగల దేశాలు శాంతియుత సహజీవనం చేయడానికి ఈ సూత్రాలు గట్టి ప్రాతిపదికఅని సోవియట్ పదే పదే స్పష్టంచేసింది. వీటిని అగ్రరాజ్యాలతో సహా అన్ని దేశాలు అంగీకరిస్తే, అంతర్జాతీయ ఉద్రిక్తత తగ్గడానికి, ప్రజలమధ్య విశ్వాసాన్ని పెంపొందించడానికి తోడ్పడుతుంది. అని మికోనియాన్ చెప్పారు.

కేంద్రంలో సంస్కృతి మంత్రి పదవి

డాక్టర్ ముల్కురాజ్ సూచన

న్యూఢిల్లీ, మార్చి 27

ప్రఖ్యాతరచయిత డాక్టరుముల్కురాజ్ ఆనంద్ నేడిక్కడ జరిగిన నాటక గోష్టిలో ఉపన్యసిస్తూ, సంస్కృతి పరంగా కేంద్రంలో ఒక మంత్రి పదవి ఏర్పాటుచేయాలని సూచించారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా, అభివృద్ధి పథకాలద్వారా దేశంలో ఎన్నో గొప్పపనులు జరిగిపోతున్నాయని, రచయితలు వీటిని తమ నాటికలలో ప్రతిబింబపచేయాలని ఉద్బోధించారు.

సంగీత నాటక అకాడమీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి కమలాదేవిఛటోపాధ్యాయ ఉపన్యసిస్తూ, సంస్కృతి పరంగా కేంద్రంలో ఒక మంత్రి పదవి ఏర్పాటు చేయాలనే సూచనను వ్యతిరేకించారు. ప్రభుత్వ యంత్రాంగంలో తనకు చాల కాలంగావున్న అనుభవందృష్ట్యా, ప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణ క్రింద సాంస్కృతిక ఉద్యమం అభివృద్ధి పొందజాలదన్నారు. అకాడమీవారు నాటకీయ పాఠశాల నడపడానికై నిశ్చయించారని, త్వరలో నిర్ణీతపథకం రూపొందించనున్నారని తెలియజేశారు.

పాక్ ప్రముఖుల విచారం

భారత ప్రతినిధి శ్రీ ఖన్నాకు అవమానం జరిగినందుకు

న్యూఢిల్లీ, మార్చి 28

పాకిస్తాన్ రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో భారత ప్రతినిధి శ్రీ మెహర్‌చంద్ ఖన్నా పరాభవింపబడినందుకు పాక్ విదేశాంగమంత్రి, పాక్ ప్రధానమంత్రి చాల విచారం వెల్లబుచ్చారని ప్రధాని నెహ్రూ ఈ వేళ లోక్‌సభలో తెలియజేశారు.

ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన కోతతీర్మానాన్ని దాఖలు చేసుకోవాలా వద్దా అనే సమస్యపై మాట్లాడుతూ ప్రధాని నెహ్రూ ఈ విషయం వెల్లడించారు.

రేడియోలో బి. సి. రాయి ప్రసంగం

పార్లమెంటులో ప్రశ్నలు

న్యూఢిల్లీ, మార్చి 28

బెంగాల్, బీహార్‌లవిలీనీకరణసమస్యపై ఆలిండియారేడియోలో ప్రసంగించడానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి డాక్టర్ రాయికి అనుమతి యివ్వబడింది కాబట్టి, ఆయన అభిప్రాయానికి వ్యతిరేకంగా వుండే పార్టీలవారు సూచించే ఒక వ్యక్తి రేడియోలో ప్రసంగించడానికి అవకాశం యిస్తామని సమాచార శాఖ మంత్రి డాక్టర్ బి. వి. కేస్కర్ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

ప్రొఫెసర్ హీరేన్‌ముఖర్జీ అడిగిన ప్రశ్నకు డాక్టర్ కేస్కర్ సమాధానం చెపుతూ, వివాదాస్పదమైన నేటి రాజకీయ సమస్యలపై ప్రసంగాలకు ఆలిండియా రేడియో సాధారణంగా అనుమతి యివ్వదన్నారు. కాని, ఇది జరిగిందికాబట్టి విలీనీకరణను వ్యతిరేకించేవారి అభిప్రాయాలను చెప్పడానికికూడా ప్రత్యేకంగా అనుమతి నివ్వదలచామని చెప్పారు.

ప్రొఫెసర్ ముఖర్జీ: విలీనీకరణప్రతిపాదనను వ్యతిరేకించేవారంతా వచ్చే ఎన్నికల్లో తమకు అనుకూలమైన పరిస్థితిని సృష్టించుకొనేందుకు యత్నించుతున్నారని డాక్టర్ రాయి తన రేడియో ప్రసంగంలో అన్న విషయం మంత్రి దృష్టికి తీసుకొనిరాబడిందా? ఆయన ప్రసంగాన్ని రేడియో అధికారులు ముందుగా పరిశీలించారా?

డాక్టర్ కేస్కర్: నేనింతకు ముందే చెప్పినట్లు ప్రస్తుత రాజకీయ సమస్యలపై వివాదాస్పదంగా వుండే ప్రసంగాలను మేము అనుమతించం. ఇక ప్రసంగాల్లో వెలిబుచ్చబడిన అభిప్రాయాలు ప్రసంగించిన వ్యక్తివిగానే పరిగణించాలి. అవి రేడియోవారి అభిప్రాయాలే అయివుండ నవసరంలేదు.

సాధనగుప్త: ప్రసంగాల వ్రాతప్రతులను ముందుగానే ఆలిండియా రేడియో అధికారులు పరిశీలించే ఆచారం వుందిగదా. అలాంటప్పుడు ఎన్నికలనుగురించి డాక్టర్ రాయి ప్రస్తావించడాన్ని ఎందుకు అనుమతించారు?

శ్రీ నెహ్రూ: అదంతా ప్రసంగించే వ్యక్తిపై ఆధారపడి వుంటుంది. ప్రధానమంత్రి ప్రసంగాన్ని ఆయన తప్ప ముందుగా ఎవ్వరూ పరిశీలించరు.

విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రి కార్మికులసమ్మె

(విశాలాంధ్ర విలేఖరి)

విశాఖపట్నం, మార్చి 28

విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రి పనివారు నేటి ఉదయం సమ్మె ప్రారంభించారు. వీ రిదివరలోకోరిన కోర్కెలను తీర్చకపోవడం అటుండగా నిన్న మళ్ళీ ఒక కార్మికుని బర్తరఫ్ చేశారు.

ఆస్పత్రి పనివారు ఫిబ్రవరి 16 వ తేదీన సమ్మె నోటీసు ఇచ్చారు. ఆ నోటీసు ప్రకారం సమ్మె చేయడానికి ఇవాళే ఆఖరురోజు. నేటి సమ్మెలో నూటికి 80 మంది పాల్గొంటున్నారు.

ఆస్పత్రి కార్మికసంఘ అధ్యక్షుడు శ్రీ యం. వి. భద్రం ఈ సందర్భంలో ఒక ప్రకటనచేస్తూ, కార్మికులు తమ కోర్కెలను తీర్చవలసిందని, లేదా వాటిని పరిష్కర్త తీర్పుకు పంపవలసిందని కోరుతూ ఫిబ్రవరి 16 వ తేదీన సమ్మె నోటీసు యిచ్చినప్పటికీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని నిరసించారు. నిన్న మరొక కార్మికుడిని బర్తరఫ్ చేశారని, కార్మిక సంఘం ఎన్ని ఉత్తరాలు రాసినా ప్రభుత్వం జవాబివ్వలేదని, ఈ పరిస్థితులే సమ్మెకు దారితీశాయని అన్నారు. కార్మికుల కోర్కెలు 18 లో 1 నెరవేర్చబడ్డాయని ఆరోగ్యశాఖామంత్రి 24వ తేదీన ప్రకటించారు. అయితే, యిప్పుడు కార్మికులు సమ్మెకుసంబంధించినకోర్కెలను గురించి ఆయన ప్రస్తావించలేదు. ఆయన చెబుతున్న 18 "కోర్కెలు" ఇప్పుడు కార్మికులు కోరిన 10 కోర్కెలలో ఒక్క దానికి మాత్రమే సంబంధించినవి.

గత ఆగష్టులోజరిగిన కన్సిలియేషన్ ఒప్పందంలోని కొన్ని అంశాలను ఆలస్యంగానైనా ప్రభుత్వం గుర్తించినందుకు సంతోషమే. కాని, ఇప్పుడు మంత్రిచేసిన ప్రకటన ప్రస్తుత సమస్యను పరిష్కరించడానికి తోడ్పడదు. అందుచేత యావన్మందిప్రజలు, కార్మికసంఘాలు, ప్రజాసంస్థలు రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి, కార్మికుల కోర్కెలను అంగీకరించేట్టు చేయాలని కోరుతున్నాను.

జూన్22నలండన్‌కు ప్రధాని నెహ్రూ ప్రయాణం

కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికి

లండన్, మార్చి 28

కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశానికై ప్రధాని నెహ్రూ జూన్ 22 వ లండన్ చేరుకుంటారని తాత్కాలికంగా నిర్ణయించబడిన కార్యక్రమం తెలుపుతోంది. జూలై ఆరవ తేదీన నెహ్రూ వాషింగ్టన్ బయలుదేరి వెళ్ళుతారు.

జూన్‌లో వాషింగ్టన్‌కు ఫ్రెంచి విదేశాంగ మంత్రి పయనం

పారిస్, మార్చి 28

అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్ ఆహ్వానంపై ఫ్రెంచి విదేశాంగమంత్రి పినో జూన్‌లో వాషింగ్టన్ వెడతారని నేడు ఫ్రెంచి విదేశాంగశాఖ ప్రకటించింది. కరాచీలో ఆగ్నేయాసియా సైనికకూటమి సమావేశ సందర్భంలో ఈ ఆహ్వానం అందజేయబడిందట.

గృహపరిశ్రమల బోర్డు డైరెక్టర్ల ఎన్నిక

దామాషా పద్ధతిపై జరగాలని హైద్రాబాద్ శాసనసభలో ఫ్రంటు సభ్యుని సూచన

హైదరాబాదు, మార్చి 28

గృహపరిశ్రమల బోర్డును శాసనసభ ఎన్నుకోటం మాత్రమే చాలదనీ, ఆ ఎన్నిక దామాషా ఓటు పద్ధతిపై జరగటమవసరమనీ ఫ్రంటు శాసనసభ్యుడు శ్రీ బి. డి. దేశముఖ్ నేడు హైదరాబాదు శాసనసభలో ఒక సూచన చేశారు.

హైద్రాబాదు శాసనసభలో ఇవాళ ప్రశ్నోత్తరాల అనంతరం చిల్లరబిల్లులు చర్చకు వచ్చాయి.

మోటారు నూనెలపై పన్ను హెచ్చిస్తున్న సవరణబిల్లును సభ్యులు మొదట చర్చించారు. సవరణలూ, చర్చలూ విశేషం లేకుండానే అయిదు నిముషాలలో బిల్లు సభ ఆమోదాన్ని పొందింది.

తర్వాత చిన్నతరహా పరిశ్రమలకూ, గృహ పరిశ్రమలకూ ప్రభుత్వ సహాయం ఇవ్వడం గురించిన బిల్లు చర్చకు వచ్చింది.

శ్రీవి.బి.రాజు(కాం) ప్రసంగిస్తూ ప్రభుత్వం ఇస్తున్న సహాయాల్ని చట్టబద్ధంచేయడానికేఈబిల్లుఅన్నారు. ప్రభుత్వం ధనం ఇస్తుందంటే దరఖాస్తులు చాలా వస్తాయి. ఎవరర్హులు ఎవరుకారు అనేది తేల్చేటందుకు ప్రభుత్వం ఒక సలహాసంఘాన్ని ఆలోచించే అధికారం ఈ బిల్లు ద్వారా లభిస్తుంది. కాని ఇది సమగ్రంగా లేదు, ప్రభుత్వంపు ఈ చర్య [illegible] తడుము కొంటున్నట్లున్నదన్నారు.

శ్రీ కంచిగేపల్లి చిన వెంకట్రామారావు (ఫ్రంట్) ప్రసంగిస్తూ, వివిధ గ్రామీణ పరిశ్రమలకు వేర్వేరుబోర్డులను ఖాదీబోర్డుఅనీ, గ్రామపరిశ్రమల బోర్డు అనీ నిర్మించే కన్న గ్రామ పరిశ్రమలన్నింటికీ కలిపి సమిష్టిగా ఒకే బోర్డును నియమించడం మంచిదని సూచించారు. కుటీర పరిశ్రమ అన్నది కేవలం కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొనేదిగా నిర్వచనం ఇవ్వబడిందని దానిని కొంత విస్తరింపచేయడం అవసరమనీ అన్నారు.

ఈ పరిశ్రమల బోర్డును సలహా వరకు మాత్రమే పరిమితం చేయక పరిశ్రమాభివృద్ధికవసరమయ్యే పూర్తిఅధికారాల నివ్వాలన్నారు. యంత్ర పరిశ్రమల పోటీలో కుటీర పరిశ్రమలు నిలబడలేవు కనక వీనికి రక్షణయిచ్చి పోటీనుంచి కాపాడాలన్నారు. మార్కెటు హామీ వుండాలన్నారు.

శ్రీ వి. డి. దేశపాండే (ఫ్రంట్) బోర్డు సభ్యులు కార్ఖానాలు దఫ్తరాలు అప్పుడప్పుడు పరీక్షించేటందుకు అధికారం ఇవ్వాలి. ఏ యే జిల్లాలలో ఏ యే పరిశ్రమలవారు ఎంతెంత ధనం కోరారు? ఎంత ఇచ్చేరు? ప్రథమ పంచవర్ష ప్రణాళికలో కేటాయింపు 6 కోట్లలో ఏంతఖర్చయింది? ఏమిమిగిలింది? -దీనికి మంత్రి సమాధానంచెప్పాలి.

ప్రభుత్వం నియమించే బోర్డు ప్రాంతాలవారీగా ఉపసంఘాలనేర్పరచవలెనో, లేక బోర్డు ఆయాప్రాంతాలలో సమావేశం అవుతూండడమో చేయాలి.

చర్చలకు మంత్రి శ్రీ విద్యాలంకార్ సమాధానం ఇస్తూ, బోర్డు ఒకేమారు సమావేశం అయిందనీ, సహాయానికి దరఖాస్తులు వస్తున్నాయి కాని, ఇంకా దండిగా రావడంలేదనీ అన్నారు. అవన్నీ క్రమాన తేలుతాయన్నారు. ఇతర రాష్ట్రాలలో ఎక్కడా గృహపరిశ్రమ లన్నింటికీ కలిపి సమగ్రమైన బోర్డును నిర్మించలేదనీ, అది ఏర్పరచినా ఏపనీ చెయ్యలేక పోతుందనీ అన్నారు.

ఇండస్ట్రియల్ ట్రస్ట్‌ఫండ్ పెద్ద పరిశ్రమల సాయానికి వెళ్ళి బోల్తా కొట్టిందనీ, ఫలితంగా ఇంతవరకు చిన్నతరహా పరిశ్రమలకు సాయం ఇవ్వలేక పోయామనీ, అన్నారు. ఈ సహాయం ప్రధానంగా పరికరాల రూపంలోనూ, కొద్దిగా ధనరూపంలోనూ వుంటుందన్నారు.

తర్వాత బిల్లును క్లాజువారీ చర్చకు తీసుకొన్నారు.

శ్రీ అనంతరామరావు (ఫ్రంట్) చిన్నతరహా పరిశ్రమ 50 మందికి మించని పనివారు కలదిగా నిర్వచించాలన్నారు.

మంత్రి దానిని అంగీకరించారు.

బోర్డు సభ్యుల సభ్యత్వ పరిమితి రెండేళ్ళ బదులు మూడేళ్ళుగా నిర్వచించాలని శ్రీ మద్దుం (ఫ్రంట్) సూచించారు.

మంత్రిగారి సమాధానంపైసభ్యులు తమ సవరణల నుపసంహరించుకొన్నారు.

కంపెనీ డైరెక్టర్ల బోర్డులో కనీస సంఖ్య అయినా భారతీయులుండాలనేమాట అనవసరమనీ ఇక్కడ డైరెక్టర్ల బోర్డులో పైవాళ్ళుండడం జరగరాదనీ శ్రీ మద్దుం అన్నారు. ఆయన సవరణను మంత్రి స్వీకరించారు.

విశేషమైన చర్చ లేకుండానే తర్వాత క్లాజులు ఆమోదించబడ్డాయి. బిల్లు చట్టం చేయబడింది.

బ్రిటిష్ జౌళి పరిశ్రమ దుస్థితి

మాంచెస్టర్, మార్చి 27

బ్రిటన్‌లోకి విదేశాలనుండి, ముఖ్యంగా భారతదేశం నుండీ, హాంకాంగ్‌నుండీ బట్టలుదిగుమతి కావడంవల్ల బ్రిటిష్ జౌళి పరిశ్రమకు తీరని నష్టం కలుగుతున్నదని బ్రిటిష్ జౌళి పరిశ్రమ యజమానులు తీవ్ర ఆందోళన సాగిస్తున్నారు.

భారతదేశంనుండీ, హాంకాంగ్ నుండీ కలిపి బ్రిటనులోకి బట్టలుదిగుమతి 1952 లో ఒక కోటి 80 లక్షల చదరపు గజాలు, 1953 లో ఒక కోటి 80 లక్షల గజాలు, 1954 లో 15 కోట్ల 30 లక్షల గజాలు, 1955 మొదటి ఆరుమాసాల్లోనే పదికోట్ల 40 లక్షల గజాలని లెక్క తేలింది.

బ్రిటిష్ జౌళిపరిశ్రమను కాపాడాలంటే ఈదిగుమతులపై వెంటనే కచ్చితమయిన పరిమితులను అమలుజరపాలని ఆపరిశ్రమయజమానులు ప్రభుత్వాన్ని కోరారు.

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త:— కాట్రగడ్డ రాజగోపాలరావు—ముద్రణ. స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, బకింగ్‌హాం పేట, విజయవాడ. సంపాదకవర్గం:— మోటూరు హనుమంతరావు, [అధ్యక్షుడు] కంభంపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ రాజగోపాలరావు.